పాదచారుల బాట.. పార్కింగ్‌కేనట



ప్రమాదాల నివారణకు రహదారుల పక్కనే పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను పార్కింగ్ ప్రదేశాలుగా మార్చేసుకున్నారు. రామవరప్పాడు ఇన్నర్ రింగురోడ్డు వద్ద ఇలా అనధికారికంగా ప్రైవేటు వాహనాలను నిలుపుతుండడంతో జనాలు ఇబ్బంది పడుతున్నారు. - ఈనాడు అమరావతి

భక్తిశ్రద్ధలతో ఓనం పండగ

వృత్తి, ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా కేరళం రాష్ట్రీయులు. కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో ఓనమ్ వేడుకలు చేసుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వంద కుటుంబాల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి.

- న్యూస్‌టుడే, విజయవాడ సిటీ



కుదిపేసి రెండేళ్లు.. కట్టడికి ఎన్నేళ్లు?

- కాగితాలు దాటని ఆక్రమణల తొలగింపు
- వందల ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు, సాగు
- బుడమేరు ప్రళయం నుంచి గుణపాఠాలు నేర్వరేం?

ఆగస్టు 31 2024.. బుడమేరు కట్ట తెంచుకుని విరుచుకుపడింది. వరద ఉగ్రరూపానికి బెజవాడ గజగజలాడింది. నగరవాసులు గుండెలు గుప్పిట పెట్టుకుని పది రోజులు బిక్కుబిక్కుమని బతికారు. విజయవాడ చరిత్రలో ఎన్నడూ లేనంతగా భయంకరంగా ముంచుకొచ్చిన జల ప్రళయంలో ఏకంగా పదుల మంది కొట్టుకుపోయారు. ఇంతటి ఉపద్రవానికి ఊహించని వరదలు, భారీ వర్షాలు తోడయ్యాయి. గట్టు బలహీనత, బుడమేరు పొడవునా అడ్డగోలు ఆక్రమణలూ శాపాలయ్యాయి. ఆక్రమణల అంతు చూస్తామని ప్రభుత్వం ప్రకటించినా కార్యాచరణ కానరాలేదు. మరోమారు విపత్తు దూసుకొస్తే పరిస్థితి ఏంటనే ఆలోచనే ప్రతి గుండెను కలవరపెడుతోంది. - ఈనాడు, అమరావతి



నోటీసులూ ఇవ్వలేదు

ఇవీ... సింగ్‌నగర్ వంతెన సమీపంలో బుడమేరు ఆక్రమణలు. కాలువ సగం వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వరద వస్తే ఇక్కడ నుంచి 3000 క్యూసెక్కులు కూడా బయటికి వెళ్లవు. కనీసం ఆక్రమణదారులకు నోటీసులు కూడా ఇవ్వలేదు.

380 ఎకరాల్లో పాగా..

✪ బుడమేరు పరివాహక ప్రాంతం 2,930 ఎకరాలు. విజయవాడ గ్రామీణంలో 300 ఎకరాల బుడమేరు వాగును ఆక్రమించి సాగు చేస్తున్నారు. సింగ్‌నగర్, నందమూరినగర్, న్యూరాజరాజేశ్వరీ పేటల్లో 80 ఎకరాలు ఆక్రమించారు. వీటిలో 3,051 నిర్మాణాలున్నాయి. 750 అపార్టుమెంట్లు, 2,000 గృహాలు, 300 వ్యాపార కేంద్రాలు, దుకాణాలు, ఇతర నిర్మాణాలున్నాయి. వీటి విలువ రూ.800 కోట్ల పైమాటే. పాత ఆక్రమణలేకాదు... రెండేళ్లలో వందల్లో కొత్త ఆక్రమణలొచ్చాయి.



✪ ఆక్రమణలు తొలగింపు, నిర్వాసితులకు పరిహారం, పునరావాసానికి స్థలం ఇవ్వటం లేదా ఇళ్లు కట్టించేందుకు రూ.5,222 కోట్లు అవసరమని డీపీఆర్‌ను సిద్ధం చేశారు. అధిక వ్యయం కావటంతో ముందుకెళ్ల లేదు.

మట్టితో పూడ్చి...

ఇవీ.. న్యూరాజరాజేశ్వరీపేటలో బుడమేరును మట్టితో పూడ్చి కట్టిన నిర్మాణాలు. చిన్న రేకుల షెడ్డుల నుంచి బహుళ అంతస్తుల భవనాల వరకు నిర్మించారు. ఆక్రమణలతో బుడమేరు పిల్ల కాలువను తలపిస్తోంది.

ఓ వైపు ఇళ్లు.. మరోవైపు సాగు

ఇవన్నీ నందమూరినగర్‌లో ఆక్రమణలు.. ఇక్కడ ఓ వైపు నుంచి బుడమేరు ఆక్రమించి ఇళ్లు కడుతుంటే.. మరోవైపు సాగు చేస్తున్నారు. రెండేళ్ల కిందట వరదలు వచ్చిన తర్వాత 20 శాతం ఆక్రమణలు పెరిగాయి. అయినా పట్టించుకున్న నాథుడు లేరు.



బెజవాడ భద్రత ప్రశ్నార్థకమే...

✪ ఇప్పటికిప్పుడు ఆక్రమణలన్నీ తొలగించి ప్రక్షాళన చేయడం సాధ్యం కాకపోవచ్చు.. కానీ ప్రమాదం లేకుండా చర్యలు తీసుకోవాలి. నగరంలో కాలువల ప్రవాహ సామర్థ్యం 7,000-10,000 క్యూసెక్కులు, వెడల్పు 50 మీటర్లు ఉంటేనే వరదల వేళ నగరానికి ముప్పు ఉండదు.

✪ ప్రస్తుతం 50-120 మీటర్ల మధ్యలో ఉండాల్సిన బుడమేరు వెడల్పు 20-30 మీటర్లే ఉంది. ప్రవాహ సామర్థ్యం 17 వేల క్యూసెక్కులు కాగా 2,000-4,000కు పడిపోయింది. కొత్త ఆక్రమణలు పెరుగుతూనే ఉన్నాయి. భవిష్యత్తులో వరదలు వస్తే బెజవాడ భద్రత ప్రశ్నార్థకమే.

సజావుగా నీట్ పీజీ - 2026

కానూరు, న్యూస్‌టుడే : ఉమ్మడి కృష్ణా జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో నీట్ పీజీ- 2026 సజావుగా ముగిసింది. పరీక్షకు హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత, విద్యుత్తు, తాగునీరు తదితరాలను అందుబాటులో ఉంచడంతో ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగింది. విజయవాడలోని పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో, ఎనికేపాడులోని శ్రీవిజయదుర్గ ఐటీ ఇన్ఫో సొల్యూషన్స్ సెంటర్‌లో, కృష్ణా జిల్లా కానూరు ఐయాన్ డిజిటల్ సెంటర్, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో 843 అభ్యర్థులకు 818 మంది హాజరుకాగా, కానూరు ఐయాన్ డిజిటల్ సెంటర్లో 1560 మందికి 1530, గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో 306 మందికి 299 అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ నగరంలోని పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు.


కేంద్రంలోకి వరుసగా వెళుతున్న విద్యార్థులు

పంచుతున్నారా.. పంచుకుంటున్నారా?

పండగల్లో నగరపాలిక.. దుబారాపర్వం..✪ భక్తులకిచ్చే తాగునీటికి రూ.3.31 కోట్లట

ఈనాడు, అమరావతి - ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

దుర్గగుడిలో నిరుడు దసరా, భవానీదీక్షల విరమణ వేడుకలకు తరలివచ్చిన భక్తులకు మంచినీటిని ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేసినందుకు రూ.3.31 కోట్లు అయ్యిందని నగరపాలక సంస్థ నుంచి దుర్గగుడికి బిల్లులు పంపారు. ఈ రెండు వేడుకలకు నిరుడు తాము రూ.10 కోట్లు వెచ్చించామనీ.. వెంటనే ఇవ్వాలని నగరపాలిక అధికారులు బిల్లులు పంపారు. మంచినీటికి రూ.3.31 కోట్లు ఏంటని ఆడిట్ విభాగం అభ్యంతరం తెలిపింది. దీంతో మిగతా రూ.6 కోట్లను చెల్లించేసి, నీటి బిల్లును దేవస్థానం ఆపేయడంతో. . రెండు విభాగాల మధ్య వివాదం నడుస్తోంది.



అడ్డూఅదుపు లేదంతే.. దుర్గగుడిలో దసరా వేడుకలకు ఏటా రూ.15 కోట్లు కేటాయిస్తుంటారు. క్యూలైన్లు, కౌంటర్లు, షామియానాలు, కేశఖండనశాల, పోలీసులు, ఉద్యోగులు, ఇంజినీరింగ్ పనులు అన్నింటికీ నిధులు వినియోగిస్తారు. కానీ.. నగరపాలిక మాత్రం వేడుకల నిర్వహణకు దేవస్థానం ఎంత వెచ్చిస్తోందో.. దాంతో సమానంగా మేమూ ఖర్చు చేశామనేలా పేర్కొనడం గమనార్హం.

ఏదేదో చేసేశామని...

దసరా విధులకు వచ్చే ఇతర విభాగాల సిబ్బంది టీఏ, డీఏలకు ఎంత చెల్లించాలో ఆ బిల్లులను మాత్రమే దేవస్థానం చెల్లిస్తుంది. వేలల్లో వచ్చే పోలీసులకు రూ.కోటి చొప్పున ఒక్కో వేడుకకు ఇస్తారు. కానీ.. నగరపాలిక మాత్రం.. భక్తులకు ఏవేవో ఏర్పాట్లు చేశాం, మజ్జిగ పంచాం.. బిస్కెట్లు ఇచ్చామని భారీగా బిల్లులు పెడుతోంది. ఈ వ్యయం అసలు దేవాదాయశాఖ పరిధిలోనే లేదు. వేడుక అయ్యాక.. మా నుంచి ఎంత బిల్లు వస్తే అంత మీరు చెల్లించాలనేలా నగరపాలిక తీరు ఉంటోంది.

20 రోజులకు రూ.10 కోట్లా

దసరా 10 రోజులు, భవానీదీక్ష విరమణ వేడుకలు ఐదు రోజులుంటాయి. మరో ఐదు రోజులు అదనంగా వేసుకున్నా.. 20 రోజులవుతాయి. దీనికి రూ.10 కోట్ల బిల్లులంటే.. రోజుకు రూ.50 లక్షలను నీళ్లలా ఖర్చు పెట్టేస్తున్నారన్న మాట. భక్తులు అమ్మవారి కోసం సమర్పించే డబ్బులను ఇంత దారుణంగా ఖర్చు చేయడం, దానికి లెక్కా, జమా కూడా లేకపోవడమేంటి.?

ఏ దేవస్థానంలోనూ ఉండదిలా..

దుర్గగుడి వేడుకలకు.. నగరంలో ఎక్కడెక్కడ మజ్జిగ ఇవ్వాలి? బిస్కెట్ ప్యాకెట్లను పంచాలనేది చెబితే.. దేవస్థానమే ఏర్పాటు చేస్తుంది.. కదా, ప్రత్యేకంగా వీటి కోసం నగరపాలిక గుత్తేదారులను నియమించి భారీగా బిల్లులు పంపడం, దుర్గమ్మ ఆదాయాన్ని నీళ్లలా ఖర్చుచేయడమేంటి.?, దీనిపై కచ్చితంగా అధికారులు ఈ ఏడాది దృష్టిసారించాలి.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 31వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నట్టు వివరించారు. జిల్లాలోని మండల కేంద్రాలు, మున్సిపల్/నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లోనూ అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ✪ ప్రజలు పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చని కలెక్టర్ సూచించారు.

✪ ప్రజలు సమర్పించే సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ meekosam.ap.gov.in లోనూ దాఖలు(నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు నేరుగా ఫోన్ చేయవచ్చని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

అమరావతి అమ్మాయిలు.. క్రికెట్‌లో మెరుపులు



మంగళగిరిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా సెప్టెంబరు 15 నుంచి 26 వరకు మహిళల ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) జరగనుంది. ఇందులో అమీతుమీ తేల్చుకునేందుకు నాలుగు జట్లు సిద్ధమయ్యాయి. ఈ జట్లలో ఒకటైన 'అమరావతి ఈ ఛాంపియన్స్'లో కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన నలుగురికి స్థానం లభించింది. భారత మహిళా క్రికెట్ జట్టులో స్థానం పొంది విజయాలను ఆస్వాదించడమే లక్ష్యమంటున్న వీరిపై ప్రత్యేక కథనం. – న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

★ ఇబ్రహీంపట్నం మండలం జూపూడికి చెందిన **పరసా రంగలక్ష్మి** డిగ్రీ చదువుతోంది. చిన్నతనంలోనే క్రికెట్‌పై ఆమెకు ఉన్న ఆసక్తిని గమనించిన తండ్రి శ్రీహరి గౌడ్ 2014లో ఐజీఎంసీ స్టేడియంలో కోచ్ చిరంజీవి వద్ద శిక్షణకు చేర్పించారు. బీసీసీఐ లెవల్-2 కోచ్ నిర్మల్‌కుమార్ పర్యవేక్షణలో మెరుగులు దిద్దుకుంది. అండర్-16, 19, 23, సీనియర్స్ కేటగిరీల్లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2023లో కోల్‌కతాలో జరిగిన అండర్-23 వన్డే టోర్నీలో త్రిపుర జట్టుపై 172 పరుగులు చేసింది



★ పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన **కందుల హేమ సాయి రమ్యారెడ్డి** ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మేనమామ ప్రోత్సాహంతో 2022లో జీవీఆర్ అకాడమీలో కోచ్ పవన్‌సూర్య పర్యవేక్షణలో సాధన ప్రారంభించింది. 2023లో విజయవాడలోని కేకే గ్లోబల్ క్రికెట్ అకాడమీలో నూర్‌బాషా వద్ద శిక్షణ పొందింది. అండర్-19 ఏసీఏ ఇంటర్ జోనల్ టోర్నీలో సెంట్రల్ జోన్‌కు ఆడి, సౌత్ జోన్ జట్టుపై 80 పరుగులు చేసింది. రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా, రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్ బౌలర్‌గా రాణిస్తోంది. ప్రస్తుతం ఎమ్మెస్కే క్రికెట్ అకాడమీలో సాధన చేస్తోంది.



★ గుంటూరుకు చెందిన **బోగియ సాయి దీప్తి** జేకేసీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తండ్రి రాజు పర్యవేక్షణలో 2014లో సాధన ప్రారంభం. జేకేసీ కళాశాల మైదానంలో పీడీ రాజేష్ శిక్షణలో రాటుదేలింది. 2022 నుంచి 2025 వరకు ఆంధ్రా అండర్-19 జట్టుకు ఆడింది. ముంబయి, పుణెలో జరిగిన ఆరు అంతర్రాష్ట్ర మ్యాచుల్లో 13 వికెట్లు, 2025లో ఔరంగాబాద్, కోల్‌కతాలో జరిగిన నాలుగు టీ 20 మ్యాచుల్లో 7 వికెట్లు తీసింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలర్‌గా, రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా రాణిస్తోంది.



★ గుంటూరు ఎస్వీఎస్ కాలనీకి చెందిన **కాట్రగడ్డ దీక్ష** లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. స్వతహాగా క్రికెటరు అయిన తండ్రి శేషసాయిని స్ఫూర్తిగా తీసుకొని ఏడేళ్ల వయసులో ఎమ్మెస్కే క్రికెట్ అకాడమీలో గోపి పర్యవేక్షణలో సాధన ప్రారంభం. 2024-25 సీజన్‌లో ఆంధ్రా అండర్-15 జట్టుకు సారథ్యం. సౌరాష్ట్ర జట్టుపై ఆడి 53 బంతుల్లో 128 పరుగులతో రాణించింది. ఇండియా అండర్-19 జట్టులో స్థానం పొంది శ్రీలంకతో ఆడిన వన్డే, టీ20 సిరీస్‌లను కైవసం చేసుకోవడంలో కీలకంగా నిలిచింది. రైట్ హ్యాండ్ బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా సత్తా చాటుతోంది.

నీటి విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్: బ్యారేజీ నుంచి పంట కాలువలకు ఆదివారం 9,302 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు కాలువకు 5,118, పశ్చిమకు 4,012, గుంటూరు ఛానల్‌కు 172 క్యూసెక్కులు ఇస్తున్నారు. తూర్పు కాలువ నుంచి రైవస్ కాలువకు 2,005, ఏలూరుకు 1,302, కేఈబీకి 906, బందరు కాలువకు 905 క్యూసెక్కులిచ్చారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల మట్టం ఉంది.

ఐకామ్ సంస్థకు భూములు సిద్ధం

- ✪ జయంతిపురంలో 300 ఎకరాలు గుర్తింపు
- ✪ రక్షణ రంగ అనుబంధ ఉత్పత్తుల తయారీ

ఈనాడు, అమరావతి

జగ్గయ్యపేట పరిధిలోని ఏపీఐఐసీ భూముల్లో ఐకామ్ టెలీ లిమిటెడ్ సంస్థకు 300 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు వెలువరించింది. తాజాగా జయంతిపురంలో ఏపీఐఐసీ భూముల్లో ఐకామ్ సంస్థకు భూముల కేటాయింపుపై అధికారులు పరిశీలించారు. ప్రభుత్వ ధరను సంస్థ డిపాజిట్ చేశాక.. భూములు స్వాధీనం చేయనున్నారు. ఏపీఐఐసీకి జయంతిపురంలో 800, పెద్దవరంలో 1200 ఎకరాలున్నాయి. వీటిలో ఐకామ్ కోరినచోట ఇవ్వనున్నారు. ఎంఈఐఎల్ గ్రూప్‌నకు చెందిన ఐకామ్ సంస్థ రూ.895 కోట్లతో రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ సంస్థ రక్షణ రంగంతోపాటు గ్యాస్, ఆయిల్, టెలీకమ్యూనికేషన్స్ సెక్టార్‌లో అవసరమయ్యే హైక్వాలిటీ షెల్టర్లను తయారుచేస్తోంది. ఈకంటైనర్ షెల్టర్లు..తుప్పు పట్టకుండా, నీరు, దుమ్ము లోపలకు చొరబడకుండా అత్యంత పటిష్ఠంగా ఉంటాయి. ఇప్పటికే హైదరాబాద్‌లోని నాగారంలో 120 ఎకరాల్లో ఉత్పత్తుల తయారీ యూనిట్ నడుస్తుండగా.. అంతకంటే పెద్దగా జయంతిపురంలో తీర్చిదిద్దనున్నారు.

బ్రహ్మోస్‌కు వెయ్యి ఎకరాలు..

బ్రహ్మోస్ క్షిపణుల తయారీ సంస్థ యూనిట్ ఇక్కడా ఏర్పాటయ్యేలా వెయ్యి ఎకరాల భూములను సిద్ధం చేశారు. ఇప్పటికే బ్రహ్మోస్ ఏరోస్పేస్ డిఫెన్స్ కార్పొరేషన్ సీఎండీ ఆధ్వర్యంలో బృందం రెండుసార్లు వచ్చి భూములను పరిశీలించింది. వీటితో పాటు మరికొన్ని రక్షణ రంగ సంస్థలు కూడా యూనిట్లను ఏర్పాటు చేయనున్నాయి. జగ్గయ్యపేట పరిధిలో ఏపీఐఐసీ భూముల్లో మిసైల్స్, ఆయుధ తయారీ పరిశ్రమలను నెలకొల్పాలని సీఎం చంద్రబాబు నిరుడు కేంద్రానికి లేఖ రాశారు. ఆతర్వాతే ఇక్కడ డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు కేంద్రం పచ్చజెండా ఊపింది.


జయంతిపురంలో ఏపీఐఐసీ భూములకు వెళ్లేందుకు నిర్మిస్తున్న రోడ్డు

జాతీయ రహదారి చెంతనే..

విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారికి ఐదారు కిలోమీటర్ల దూరంలోనే జయంతిపురం, పెద్దవరం ఉండటం.. రవాణాకు అత్యంత అనుకూలం. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో మూడు గంటల్లో ఇక్కడికి చేరుకోవచ్చు. అందుకే డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు అత్యంత అనుకూలమని ఈప్రాంతాన్ని గుర్తించారు. ఏపీఐఐసీ, ప్రభుత్వ భూములిక్కడ వేల ఎకరాల్లో ఉన్నాయి. దశాబ్దాలుగా ఇవన్నీ ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతాలకు రహదారులు, మౌలిక సౌకర్యాలను ఏర్పాటుచేస్తున్నారు.

దుర్గమ్మకు బంగారు జడ విరాళం


కుటుంబ సభ్యులతో కలిసి జడను తీసుకువస్తున్న దాత రాధాకృష్ణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: జగన్మాత దుర్గమ్మ అలంకరణ నిమిత్తం రూ.11లక్షల విలువైన బంగారు జడను దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ(గాంధీ) కుటుంబం ఆదివారం విరాళంగా అందజేసింది. లక్ష్మీదేవి, ఇతర దైవిక రూపాలు కలిగిన బంగారు జడలో విలువైన ఆకుపచ్చ రంగు రాళ్లు, ముత్యాలు పొదిగి ఉన్నాయి. ఈ సందర్భంగా ఛైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం దుర్గగుడికి వచ్చినప్పుడు అమ్మవారికి బంగారు జడ చేయించాలన్న ఆలోచన వచ్చిందన్నారు. అప్పుడు చేసిన సంకల్పం దుర్గగుడి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కుటుంబ సభ్యులు, మిత్రుల సహకారంతో విజయవంతంగా నెరవేర్చానన్న సంతృప్తి కలిగిందన్నారు. ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తనతో పరిచయం ఉన్న మిత్రులు స్వచ్ఛందంగా శివాలయం అభివృద్ధి, అన్నదానం, ఉచిత ప్రసాదం, బంగారం, వెండి ఆభరణాలు, గోసంరక్షణ పథకాలకు రూ.1.16 కోట్ల విరాళాలు తన హయాంలో అమ్మవారి ఆలయానికి అందజేశారని తెలిపారు. మరో 15 రోజుల్లో రూ.75లక్షల విలువ చేసే బంగారు కిరీటం(డైమండ్స్ పొదిగిన) అమ్మవారికి విరాళంగా ఇచ్చేందుకు తన మిత్రుడు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. దేవస్థానం ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాదశర్మ, ప్రధానార్చకులు దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, శ్రీధర్‌శర్మ, ఈఈ రమాదేవి, పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, రాఘవ రాజు, సరిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు అండగా రావెప్

బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ విద్యార్థుల అవగాహన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే



జీరో ఎనర్జీ కూలింగ్ ఛాంబర్ గురించి వివరిస్తున్న బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ విద్యార్థులు

గ్రామీణ మహిళలకు ఆరోగ్యం, రైతులకు సేంద్రియ వ్యవసాయంపై రావెప్ శిక్షణలో విద్యార్థులు చైతన్యం కల్పిస్తున్నారు. రెండు మాసాల గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా వీరంతా పల్లెబాట పట్టారు. గ్రామీణులతో మమేకమై ఆరోగ్యం, పోషణ, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు.

గుంటూరు లాం ఫాం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ హానర్స్ కమ్యూనిటీ సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్న 47 మంది విద్యార్థులు రావెప్ శిక్షణకు పల్లెబాట పట్టారు. గరికపాడు కేవీకే గృహ విజ్ఞానశాస్త్రం శాస్త్రవేత్త ప్రభావతి పర్యవేక్షణలో వీరంతా పల్లగిరి, గరికపాడు, అనుమంచిపల్లి, బలుసుపాడు, మక్కపేట, గంప్రాయి గ్రామాల్లో నెలరోజులుగా రావెప్ శిక్షణ కొనసాగిస్తున్నారు.

- రైతులకు చిరు ధాన్యాలు సాగు చేయాలని సూచిస్తున్నారు. జీరో ఎనర్జీ కూలింగ్ ఛాంబర్ పనితీరు ప్రయోగాత్మకంగా వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్ల ప్రాముఖ్యత గురించి వివరిస్తున్నారు.
- గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి మహిళల్లో రక్తహీనత గుర్తించి మహిళలకు పోషకాహారం గురించి చైతన్యం కల్పిస్తున్నారు. చిరు ధాన్యాలతో లడ్డూల తయారీ, పండ్ల తొక్కలతో పోషకాహారం తయారీపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.
- పల్లగిరిలో విద్యార్థినులు కవిత, భాగ్యమ్మ, తస్మీన్, పూజాకుమారి, కీర్తన, ఎస్తేరురాణి, హరిత సుప్రజ, అమిత రావెప్ శిక్షణ పొందుతూ వీటిపై చైతన్యం చేస్తున్నారు. మహిళలకు కుట్లు, ఎంబ్రాయిడరీ, అల్లికల్లో బేసిక్ శిక్షణ ఇస్తున్నారు.
- శిక్షణలో ప్రతీ విద్యార్థి అయిదు కుటుంబాలను దత్తత తీసుకుంటారు. గర్భిణులు, బాలింతలు, యువతులు, రైతులు, ప్రైమరీ తరగతుల విద్యార్థులకు పోషకాహారం, చదువు గురించి వివరిస్తారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు స్పీచ్ థెరపీ చేస్తున్నారు.

విద్యార్థులకు సూచనలు

రావెప్ శిక్షణతో విద్యార్థులకు గ్రామీణ ప్రాంతంపై అవగాహన వస్తుంది. కళాశాలలో నేర్చుకున్న శాస్త్ర విజ్ఞానాన్ని గ్రామీణ మహిళలకు, రైతులకు అందిస్తున్నారు. ఇంటింటి సర్వే చేసి అనారోగ్య వివరాలు, పోషకాహార లోపాలను గుర్తించి వారికి సూచనలు చెబుతున్నారు.
- ఆర్.ప్రభావతి, కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త

నగరంలో పోస్టర్ గోడలు



ఎన్టీఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేశారిలా..

న్యూస్‌టుడే, విజయవాడ సిటీ : నగరంలో ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ గోడలపై, ఇతర బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా గోడ చిత్రాలు (వాల్ పోస్టర్లు)అంటిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, నగర సుందరీకరణకు ఇవి విఘాతంగా మారిన నేపథ్యంలో నగరపాలక సంస్థ వినూత్నంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వీటిని అంటించడానికి ప్రత్యేకంగా గోడలను ఏర్పాటు చేసింది. తూర్పు నియోజకవర్గంలో వర్తక, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు నెలకొన్నాయి. వ్యాపార సంస్థల ప్రారంభోత్సవాలు, ప్రదర్శనలు, నాయకులు పుట్టిన రోజు వేడుకల ప్రచారాలకు గోడలు, డివైడర్లు, విద్యుత్తు స్తంభాలు వినియోగిస్తున్నారు. వీటి వల్ల నగరం కళావిహీనంగా ఉంటోంది. నగరపాలక సంస్థ అధికారులు ఈ సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో పంట కాలువకు వెళ్లే రహదారి ప్రారంభంలో పోస్టర్ గోడ ఏర్పాటు చేశారు. పోస్టర్లు ఇక్కడే అంటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వీటి వల్ల నగర పోస్టర్ రహితంగా మారే అవకాశం ఉంటుంది. ఇలాంటి గోడలు ఏర్పాటుచేయడం వల్ల సిబ్బందికి పని భారం తగ్గుతుంది. ఇతర పనులకు ఆటంకం లేకుండా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

'క్రీడా మైదానాలపై నిర్లక్ష్యం తగదు'



మాట్లాడుతున్న కమలాకర్, నరహరిశెట్టి నరసింహారావు, బొర్రా కిరణ్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: క్రీడా మైదానాలు సరైన నిర్వహణ లేక నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు అందటం లేదని ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ ఛైర్మన్ జీవీవీఎస్ కమలాకర్ పేర్కొన్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న ఆయన ఎన్టీఆర్ జిల్లాకు విచ్చేశారు. స్థానిక క్రీడాకారులకు కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదివారం ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 14 జిల్లాల్లో పర్యటించానని, అనేక క్రీడా మైదానాల నిర్వహణ సరిగా లేదని గుర్తించినట్టు తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపికల్లో ప్రతిభ కంటే డబ్బు, పలుకుబడికి ప్రాధాన్యం ఇస్తున్నారంటూ క్రీడాకారులు తనకు వివరించారని తెలిపారు. క్రీడలకు కేటాయించిన నిధులపై కూడా సరైన సమాచారం లేదన్నారు. దేశానికి అత్యుత్తమమైన క్రీడాకారులను అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ప్రతిభ ఉన్న క్రీడాకారులకు అండగా ఉంటామని కమలాకర్ పేర్కొన్నారు. బొర్రా కిరణ్, నరహరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

మాతృభాష అభివృద్ధితోనే సుస్థిర ఉపాధి



పుస్తకావిష్కరణలో సమాఖ్య ప్రతినిధులు తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక భాషల్లో విద్య, ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినప్పుడే దేశ ప్రగతి, సుస్థిర ఉపాధి సాధ్యమని తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రతినిధులు పేర్కొన్నారు. గిడుగు వేంకట రామమూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయ భవనంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం, ప్రజా చైతన్య వేదిక సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాషకు దూరమవుతూ పాశ్చాత్య ఉద్యోగాలపై ఆధారపడటం వల్ల యువతలో అనిశ్చితి పెరుగుతోందన్నారు. స్థానిక సమస్యలకు స్థానిక భాషలో పరిష్కారాలు అన్వేషిస్తే ఉపాధితో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రధాన కార్యదర్శి మొవ్వా శ్రీనివాసరెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావులు మాట్లాడుతూ పాలనలో తెలుగు అమలు కోసం న్యాయ పోరాటం కొనసాగిస్తున్నామని తెలిపారు. తెలుగు మాధ్యమ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 20 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సాంకేతిక కార్యదర్శి రహ్మానుద్దీన్ మాట్లాడుతూ ఏఐ, ఎల్ఎల్ఎం వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో తెలుగుకు సమాన సామర్థ్యం ఉందన్నారు. ఈ సందర్భంగా 1973లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ కమిటీ సమర్పించిన నివేదికల సంకలనమైన 'శిష్ట వ్యావహారిక భాష, నివేదిక' గ్రంథాన్ని ముకేశ్వరరావు ఆవిష్కరించారు. ఆంధ్ర లయోలా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, భాషాభిమానుల పాల్గొన్నారు.

న్యాయనిర్ణేతలు క్షుణ్నంగా పరిశీలించాలి



రిఫరీలకు జ్ఞాపికలు బహూకరించిన సినీ హీరో సుమన్. పక్కన గల్లా రూపస్ పాల్, గ్రాండ్ మాస్టర్ ప్రకాశరావు తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పోటీల నిర్వహణ సమయంలో న్యాయ నిర్ణేతలు క్షుణ్నంగా పరిశీలించాలని సినీ హీరో, రాష్ట్ర ఫిల్మ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, గ్రాండ్ మాస్టర్ సుమన్ తల్వార్ పేర్కొన్నారు. ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(అస్మా) వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గాంధీనగర్ కౌతా వారి సత్రంలో నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రిఫరీ శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన మార్పులను గమనిస్తూ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. నేర్చుకున్న విద్యను మంచి పనికి వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. బెల్ట్ పరీక్షలు సక్రమంగా నిర్వహించి అర్హులైన వారికి మాత్రమే ప్రదానం చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ శిబిరానికి విచ్చేసిన రిఫరీలకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో అస్మా కార్యదర్శి గల్లా రూపస్ పాల్, అధ్యక్షుడు ఎస్ఎం కమల్ బాషా, నిస్కిన్ అండ్ వైఎంకే అకాడమీ వ్యవస్థాపకుడు, గ్రాండ్‌మాస్టర్ గల్లా ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటలూ ముఖ్యమే





ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికైన అండర్-14 బాలబాలికలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోరంకిలోని ఎస్ఆర్‌కే టెన్నిస్ అకాడమీలో ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-10, 14 బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ప్రముఖ వైద్యులు ఎస్.రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా సంఘం అధ్యక్షుడు వై.బాబూరావు, కార్యదర్శి ఈడె లలిత్‌కుమార్, పి.రామ్‌కుమార్, కోచ్ వై.శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అండర్-10 బాలుర విభాగంలో సీహెచ్ ఆశ్రిత్, జతిన్ చంద్ర, కె.సురార్‌చిత్, కె.భువన్, అర్జున్‌రెడ్డి, బాలికల విభాగంలో ఇస్సాక్ ప్రజ్ఞయ, వి.హస్విక శృత, ఎం.జనహిత, బి.నాగ సాయి నేహ శరణ్య, ఆర్.తన్మయి, అండర్-14 బాలుర విభాగంలో యు.సాయి శౌర్య, ఎస్.నిహాల్ రాజారామ్, శ్రీమల్లేశ్వరరెడ్డి, వై.క్రిష్, షేక్ తాంజీల్, బాలికల విభాగంలో జి.మోక్ష, టి.లలిత, పి.వంసిత, పీయూష, ఎస్.రాగ రిషికలు జిల్లా జట్లలో స్థానం సాధించారని జిల్లా సంఘం కార్యదర్శి లలిత్‌కుమార్ ప్రకటించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్



కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సౌకర్యాలు అమలు చేయాలని ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షురాలు జి.భారతి అధ్యక్షతన నిర్వహించిన ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రకాల యాప్‌లతో ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తోందని మండిపడ్డారు. ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షురాలిగా జి.భారతి, ప్రధాన కార్యదర్శిగా వీఆర్ జ్యోతి, గౌరవాధ్యక్షుడిగా ఆర్.హరికృష్ణ, న్యాయ సలహాదారుగా ఎం.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా పి.పద్మ, వెంకటరత్నం, కార్యదర్శులుగా ఎస్.కృష్ణవేణి, జె.గంగాదేవి, కె.విజయలక్ష్మి, కోశాధికారిగా వి.శిరోమణి ఎన్నికయ్యారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు కె.పోలారి తదితరులు పాల్గొన్నారు.



అలరించిన భువన విజయం

విజయవాడ సాంస్కృతికం : దృశ్య వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన 'భువన విజయం' నాటకం అలరించింది. శ్రీకృష్ణదేవరాయలుగా అంబటి మధుమోహనకృష్ణ, తిమ్మరుసుగా యల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, అల్లసాని పెద్దనగా గుమ్మా సాంబశివరావు తదితరులు తమ పాత్రలను చక్కగా పోషించారు తెలుగు భాషా సాహిత్య వైభవాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు.

అత్యాచారం కేసులో ఐదుగురి అరెస్టు

పాయకాపురం, న్యూస్‌టుడే: విజయవాడ వాంబే కాలనీలో నివాసముంటున్న రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన ఓ మహిళపై జరిగిన అత్యాచారం కేసులో ఐదుగురు నిందితులను నున్న పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ నెల 29వ తేదీ తెల్లవారుజామున ఈ ఘాతుకం జరగగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైన సంగతి తెలిసిందే. బాధితురాలి నుంచి మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ దైవప్రసాద్ వాంగ్మూలం తీసుకున్నారు. ఆయన పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టారు. ఆ సమయంలో ఫిర్యాదులో పేర్కొన్న విధంగా కాకుండా అదనంగా మరో అంశాన్ని బాధితురాలు పోలీసులకు చెప్పింది. ఈ ఘాతుకంలో మరో ముగ్గురు కూడా నిందితులకు సహకరించారని బాధితురాలు ఏసీపీ వద్ద వాపోయింది. దీంతో ఆ ముగ్గురినీ కూడా కేసులో చేర్చారు. బాధితురాలికి షేక్.రెహ్మతుల్లా(24), లింగాల సాయికుమార్(20)తో పరిచయం ఉంది. ఈ నెల 28న రాత్రి ఓ ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకలకు బాధితురాలు, నిందితులు హాజరై మద్యం తాగారు. తెల్లవారుజామున బాధితురాలి ఇంట్లోకి ప్రవేశించి వారిద్దరు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు మరో ముగ్గురు కూడా సహకరించారని తేలింది. వీరి పేర్లను పోలీసులు బయట పెట్టలేదు. నేరంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇద్దరితో పాటు అందుకు సహకరించిన ముగ్గురిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చనున్నట్టు నున్న పోలీసులు తెలిపారు.

జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీ

ట్రాఫిక్ కానిస్టేబుల్ సమయస్ఫూర్తితో తప్పిన ముప్పు



ప్రమాదంలో ధ్వంసమైన క్యాబిన్

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : జాతీయ రహదారి-30పై ఆదివారం రెండు లారీలు ఢీకొన్నాయి. సేకరించిన సమాచారం మేరకు.. రెండు లారీలు వేగంగా ఒక దాని వెనుక మరొకటి ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడ వైపు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గుంటుపల్లి ఎన్టీఆర్ కూడలి వద్ద ఓ ద్విచక్ర వాహనదారుడు రోడ్డు దాటేందుకు యూటర్న్ తీసుకుంటుండగా, అతడిని తప్పించే క్రమంలో ముందు వస్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకు వేశారు. దీంతో వెనుక వస్తున్న లారీ ముందున్న దాన్ని బలంగా ఢీకొనగా క్యాబిన్ నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ఇరుక్కున్న డ్రైవర్ భయంతో కేకలు వేయడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సుధాకర్ స్పందించారు. సమయస్ఫూర్తి, స్థానికుల సాయంతో రెండు లారీలను వేరు చేసి క్యాబిన్ తలుపులు పగలకొట్టి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. దీంతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అనంతరం నిలిచిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ఇబ్రహీంపట్నం: త్రుటిలో పెను ప్రమాదం తప్పిన సంఘటన ఇది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ సిబ్బందితో పాటు ట్రాఫిక్ ఎస్సై శివరామకృష్ణ స్థానిక రింగుకూడలిలో శనివారం అర్ధరాత్రి 1:45 సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు ఓ కారు వేగంగా దూసుకొచ్చింది. పోలీసుల వైపు వస్తూ డివైడర్‌ను ఢీకొని, ముందు వైపు ఉన్న చక్రం విరిగి అక్కడే నిలిచిపోయింది. ఆశ్చర్యపోయిన పోలీసులు వాహనం వద్దకు వెళ్లి అందులోని నలుగురు వ్యక్తులను బయటకు తీశారు. క్రేన్ సాయంతో కారును రోడ్డు పక్కకు తొలగించారు. కారు డివైడర్‌ను ఢీకొనకుండా ఉంటే ప్రమాద తీవ్రత ఘోరంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. విధులు నిర్వహిస్తున్న పోలీసులతో పాటు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారు, రహదారిపై ఉన్న మరికొందరు ప్రమాదానికి గురయ్యేవారన్నారు.



క్రేన్ సాయంతో కారును పక్కకు తీస్తున్న పోలీసులు



బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

ట్రాక్టర్ కింద పడి.. ఇద్దరి దుర్మరణం





నాగరాజు, రమేష్ (పాతచిత్రాలు)

ఎర్రుపాలెం, గంపలగూడెం, న్యూస్‌టుడే: వివాహానికి హాజరై ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన దుర్ఘటన ఎర్రుపాలెం మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పెసరమల్లి నాగరాజు(32), ఏపీలోని గంపలగూడెం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొరకప్పుల రమేష్(45) ద్విచక్ర వాహనంపై బుచ్చిరెడ్డిపాలెంలో ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం గ్రామంలోని తమ మామ ఇంటి నుంచి ప్రధాన రహదారిపైకి వస్తూ.. అదే సమయంలో మట్టి తరలిస్తున్న బనిగండ్లపాడుకు చెందిన ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ట్రాక్టర్ ఎదురుగా ఉన్న ప్రహరీని ఢీకొని ట్రక్కు వారిపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మధిర గ్రామీణ సీఐ మధు, ఎస్సై రమేష్‌కుమార్ ప్రమాదస్థలాన్ని పరిశీలించి ట్రాక్టర్ ట్రక్కును తొలగించి మృతదేహాలను బయటకు తీశారు.

- మృతి చెందిన నాగరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరూ ఇదే గ్రామానికి చెందిన ముల్లంగి లాజర్ కుటుంబంలో అల్లుళ్లు కావటంతో ఆయా కుటుంబాల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో ఎన్నడూ లేనివిధంగా ఘోర ప్రమాదం జరగటంతో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసి సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



వంకాయలు-24, టమాటా-24, బెండ-14, పచ్చిమిర్చి-32, కాకర-26, బీర-24/28, క్యాలీఫ్లవర్-35, క్యాబేజి-24, క్యారెట్-40, దొండ-24, బంగాళదుంప-23, ఉల్లిపాయలు-48, గోరుచిక్కుళ్లు-20, దోస-16, సొర-8/10, పొట్ల-15/20, అరటికాయ-7/8, చామదుంప-34, అల్లం-80/190, మునగ-6/5, ఆకు కూరలు (కట్ట)-2.50/6, కంద-34, బీట్‌రూట్-40, కీరదోస-50, బీన్స్-90, క్యాప్సికమ్-50, నిమ్మ(డజను)-48/60, కొత్తిమీర-10/20, పుదీనా-5/15, ముల్లంగి-8/10, పచ్చిమామిడి-10/12 **(నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు(కిలో రూ.ల్లో) వర్తిస్తాయి.**

- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

సీపీ మైదానంలో శతకాల మోత

సెంట్రల్ జోన్ అండర్-23 క్రికెట్ టోర్నీ



జి.దేవ్ ప్రమోద్ (238)



కేఎల్ శ్రీనివాస్ (185)



పి.దుర్గా బాలాజీ (60 నాటౌట్)

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మూలపాడు ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లోని సీపీ మైదానంలో ఆదివారం గుంటూరు బ్యాటర్లు శతకాల మోత మోగించారు. 177 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన గుంటూరు జట్టు ఆట నిలిపే సమయానికి 130 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 603 చేసింది. జి.దేవ్ ప్రమోద్ 238, కేఎల్ శ్రీనివాస్ 185 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ ఒ.రణదీప్ (5/118)మెరిశాడు. గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్‌లో 361 పరుగులు చేయగా.. పశ్చిమ గోదావరి జట్టు 209 పరుగులు చేసిన సంగతి విదితమే. దీంతో ఇరు జట్ల మధ్య మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్ ఆధిక్యం కనబరచడంతో గుంటూరు జట్టు 11 పాయింట్లు, పశ్చిమ గోదావరి జట్టు 6 పాయింట్లు తమ ఖాతాలో జమ చేసుకున్నాయి. డీవీఆర్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కృష్ణా జట్టు 150 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను కొనసాగించి 40.3 ఓవర్లలో 151 పరుగులకే ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్లు జీజీ పార్థసారథి, పి.దుర్గాబాలాజీ చెరో నాలుగేసి వికెట్లు కూల్చారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 28 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 157 పరుగులతో విజయకేతనం ఎగురవేసింది. పి.దుర్గా బాలాజీ 60 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ఎ.కిరణ్ 50 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ జి.నిఖిల్ ఒక వికెట్ పడగొట్టాడు. కృష్ణా జట్టు తొలి ఇన్నింగ్‌లో 224, ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్‌లో 220 పరుగులు చేసిన సంగతి పాఠకులకు విదితమే. ప్రకాశం జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో కృష్ణా జట్టుపై విజయం సాధించింది. ప్రకాశం జట్టు 11 పాయింట్లు, కృష్ణా జట్టు 5 పాయింట్లు తమ ఖాతాలో జమ చేసుకున్నాయి.

రసవత్తరం.. రెట్టించిన ఉత్సాహం



ఫుట్‌బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

మైలవరం(జి.కొండూరు),: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి మైదానంలో ఏపీ ఎఫ్ఏ ఆధ్వర్యంలో రాధిక ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో జరుగుతున్న సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం మూడో రోజు ఉత్సాహంగా సాగాయి. క్వార్టర్ ఫైనల్-3లో విశాఖపట్నం 2-0 తేడాతో కాకినాడపై, క్వార్టర్ ఫైనల్-4లో విజయనగరం 4-1తో శ్రీసత్యసాయిపై గెలిచి సెమీస్‌కు చేరాయి. తొలి సెమీ ఫైనల్లో విశాఖపట్నం 3-1తో ఈస్ట్ గోదావరిపై ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈస్ట్ గోదావరి, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం సెమీస్‌కు చేరగా విశాఖపట్నం ఈస్ట్ గోదావరిపై విజయం సాధించి ఫైనల్‌కు చేరిందని ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శేషగిరిరావు తెలిపారు.

విజయవాడ తూర్పు

నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో పీజీఆర్ఎస్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లుగా నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో నివాసం ఉండే ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కరెన్సీనగర్ 80085 74652



స్పందన: ❖ నాలుగో డివిజన్ ఆటో నగర్ విజయలక్ష్మి కాలనీ, హైటెన్షన్ రోడ్డు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి నాంచారయ్య మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో పూడిక తీయించారు. ❖ మూడో డివిజన్ గుణదల ఎస్సీ కాలనీ, పుల్లేటికట్ట ప్రాంతాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి రంగనాయకమ్మ కార్పొరేషన్ మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల పొగ పెట్టించారు. ❖ నాలుగో డివిజన్ వెటర్నరీ కాలనీ 4-21/263 విద్యుత్ స్తంభానికున్న వీధి దీపం గత కొన్ని రోజులుగా వెలగడం లేదని స్థానిక నివాసి రామచంద్రరావు ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - **న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

కొత్త పింఛన్లపై కోటి ఆశలు..

న్యూస్‌టుడే, విజయవాడ సిటీ

పేద, మధ్య తరగతి వర్గాలకు ఆర్థిక భరోసాగా నిలిచే సామాజిక భద్రత పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల కొత్త పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా నియోజకవర్గంలో సుమారు రెండు వేల మందికి పింఛన్లు రానున్నాయి. మొదటగా వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులకు మంజూరు చేయనున్నారు. సెప్టెంబరు రెండో వారం నుంచి దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిశీలన అనంతరం అర్హులకు అక్టోబరులో పంపిణీ చేసేలా కార్యాచరణ రూపొందించారు. దీనిపై నగరపాలక సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారు. సెప్టెంబరు తొలి వారంలో స్పష్టమైన మార్గదర్శకాలు వెలువడనున్నాయి.

గత ప్రభుత్వంలో తొలగించిన వారికి ప్రాధాన్యం

కొన్ని సంవత్సరాల నుంచి పింఛన్లు తీసుకుంటున్న వారిలో కొంత మందివి ఏవో కారణాలు చెప్పి వైకాపా ప్రభుత్వం పింఛను నిలిపివేసింది. ప్రతి నెలా వారికి ఆర్థికంగా అండగా నిలిచే పింఛను ఆగిపోవడం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వీరిలో అర్హులైన వారందరినీ గుర్తించి పింఛను మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం భావించింది. ఆ తర్వాత వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, కల్లు గీత, మత్స్యకార తదితర వర్గాలకు ఇవ్వనున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని 21 డివిజన్లలో సుమారు రెండు వేల మంది లబ్ధి పొందే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో పింఛన్ల కోసం వస్తున్న వినతులు ఎక్కువగా ఉండటంతో నాయకులకు రెండేళ్ల నుంచి చెప్పడం కొంత ఇబ్బందిగా ఉంది. కొత్తగా విడుదల చేయబోతున్నట్లు ప్రభుత్వ ప్రకటనతో నాయకులు హర్షిస్తున్నారు.



లబ్ధిదారుకు పింఛను అందజేస్తున్న ఉద్యోగి

ఆర్థిక సాయాన్ని పెంచారు..

నియోజకవర్గంలోని 21 డివిజన్లలో సుమారు 19,900 మందికి పైగా పింఛన్లతో లబ్ధి పొందుతున్నారు. వీరితో పాటు కొత్తగా అక్టోబరు నుంచి అమలు చేయడానికి చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల ఆర్థిక సాయాన్ని భారీగా పెంచింది. వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, తీవ్ర అనారోగ్య సమస్యలు, మంచాలకు పరిమితమైన వారికి రూ.10 వేలు, రూ.15 వేలు చొప్పున అర్హత ఆధారంగా పెంచింది. దీంతో ఆయా కుటుంబాలకు ఇది చాలా ఆర్థిక ఆసరా కానుంది.

నియోజకవర్గంలో 2 వేల మంది ఎదురుచూపు

స్థానిక ఎన్నికల ప్రకటన వస్తే సందిగ్ధమే..

ప్రభుత్వం స్థానిక సంస్థలకు సెప్టెంబరులో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేస్తే పింఛన్ల ప్రక్రియ నిలిచిపోయే అవకాశం ఉందని లబ్ధిదారుల్లో ఆశ సన్నగిల్లుతోంది. కొత్త పింఛను విడుదల చేసిన తర్వాతే నోటిఫికేషన్ ఇస్తే ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

దుకాణం పెట్టుకొని.. అద్దె పుచ్చుకొని

కార్పొరేషన్ రోడ్లపై ఆక్రమణదారుల ఇష్టారాజ్యం

న్యూస్‌టుడే, కరెన్సీ నగర్



రోడ్డు స్థలంలో ఆక్రమించిన దుకాణాలు

శివారు కాలనీలోని రోడ్లను స్థానికులు అద్దెకు ఇస్తున్నారు. ఎవరి ఇళ్ల ముందు వారు రోడ్డును తాత్కాలిక దుకాణంగా మార్చి బాడుగ వసూలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి సాగుతున్నా కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం పట్టించుకోవడం లేదు. వీటిని తొలగించి మొక్కలు నాటాలని స్థానికులు కోరుతున్నారు.

✶ మూడో డివిజన్ కరెన్సీనగర్ ప్రధాన రహదారి మలుపు వద్ద 60 అడుగుల రహదారి ఆక్రమణలతో కుంచించుకుపోయింది. ఫలితంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో వాహనాలు ముందుకు సాగడం లేదు. వేగ నిరోధకాలు వేయాలని కార్పొరేషన్ అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

✶ ఈ ప్రాంతంలో కొంతమంది స్థల యజమానులు రోడ్డును ఆక్రమించి కూరగాయలు, కొబ్బరి బొండాలు, పూలు పండ్ల దుకాణాలకు అద్దెకు ఇచ్చారు. నెలకు పది వేలకు పైబడి రాబడి సమకూర్చుకుంటున్నారు. షాపులు ఏర్పాటు చేయడంతో కాలువల్లో పూడిక తీయడం కష్టంగా మారింది. దుర్వాసన, దుర్గంధంతో నిల్చోలేని స్థితి.

✶ రోడ్డును ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నా కార్పొరేషన్ అధికారులకు పట్టడం లేదు. చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. స్థానికులు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. కొంత మంది సచివాలయం సిబ్బంది స్వలాభం కోసం వీటిని చూడచూడనట్లు వ్యవహరిస్తున్నారని సమాచారం.

✶ ప్రతి కూడలిలో ప్రకటన బోర్డులు వెలుస్తున్నాయి. రోడ్డును ఆక్రమించి బోర్డులు పెడుతున్నారు. రాత్రికి రాత్రి సిమెంటు కాంక్రీట్‌తో వీటిని భూమిలోకి పాతేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రామవరప్పాడు రింగ్ నుంచి కరెన్సీ నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో వీటి సంఖ్య ఎక్కువ.

✶ రామవరప్పాడు రింగ్ సెంటర్ నుంచి కరెన్సీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో తినుబండారాల దుకాణాలు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. వీటికి వచ్చే వారి సంఖ్య ఎక్కువ కావడంతో వాహనాలన్నీ రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళితే టిఫిన్లు తిని వెళ్లి పోతున్నారని స్థానికులు చెబుతున్నారు.

ఎన్నాళ్లీ మురుగు తోడివేత



న్యూస్‌టుడే, కరెన్సీనగర్: మూడో డివిజన్ శివారు కాలనీ కరెన్సీ నగర్‌లో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన కథనంతో యంత్రాలను ఏర్పాటు చేసి రోజూ తోడుతున్నా మురుగు సమస్య పరిష్కారం కావడంలేదు. శాశ్వత ప్రాతిపదికన కొత్త పైపులు ఏర్పాటు చేస్తే కానీ ఈ సమస్య నుంచి కరెన్సీనగర్ బయట పడదు.

☛ కరెన్సీ నగర్ నుంచి నాగార్జున నగర్ భూగర్భ డ్రైనేజీకి వెళ్లే మార్గంలో అడ్డంకులు ఏర్పడ్డాయి. గత నెల రోజులుగా కాలనీలో అన్ని భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ పొంగుతున్నా అధికారులు గుర్తించడంలో తాత్సారం చేశారు. కాలనీలోని మూడో రోడ్డు గుత్తికొండ ధనుంజయరావు వీధి మలుపు వద్ద సమస్యను గుర్తించారు. అక్కడ నుంచి మురుగు నీరు, వాడుక నీరు భూగర్భ మార్గం నుంచి పోవడంలేదు. ఈ ప్రాంతంలో తవ్వి కొత్త లైను ఏర్పాటు చేయాలని 10 రోజుల కిందట అధికారులు యోచించారు. ఇందుకు సంబంధించి గుత్తేదారుడిని పిలిచాకే తవ్వకాలు మొదలు పెడతామని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. దీంతో కాలనీలోని 9 అంతర్గత రోడ్లలోని మ్యాన్ హోల్స్ అన్నీ పొంగి పొర్లుతున్నాయి. ఇళ్లల్లోకి మురుగు నీరు చేరుతోంది. రోడ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

కొత్త మార్గం వేయిస్తాం

భూగర్భ డ్రైనేజీ సంపునకు వెళ్లే మార్గంలో అడ్డుకట్ట ఏర్పడింది. దీంతో ఒక మ్యాన్ హోల్ నుంచి మురుగు నీటిని తోడించి పక్క మ్యాన్ హోల్‌కి పంపుతున్నాం. కొత్త పైపుల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు చేస్తున్నాం. త్వరలో పనులు మొదలు పెడతాం. - **రామారావు, ఇన్‌ఛార్జి ఈఈ, సర్కిల్-3**

సాయం చేయడంలో ముందుంటారు



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఎటువంటి ఘటనలు జరిగినా, ఎవరికి ఆపద వచ్చినా సిద్ధార్థ వాకర్స్ క్లబ్ చేయూత అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన సిద్ధార్థ వాకర్స్ సభ్యుడు పి. హనుమంతరావుకు క్లబ్ సభ్యులందరూ కలిసి సేకరించిన రూ.2.10 లక్షల ఆర్థిక సాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎ.వి.సీతామహాలక్ష్మి, కార్యదర్శి జొన్నలగడ్డ ప్రభాకరరావు, కోశాధికారి జె.వి.శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

❖ సిద్ధార్థ వాకర్స్ క్లబ్ నెలవారీ సమావేశంలో భాగంగా సెంటిని హాస్పిటల్ సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్. జి. అజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా పురుషుల్లో ఎక్కువగా వచ్చే ప్రోస్టేట్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మధ్య వయసు దాటిన తర్వాత ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు.

అష్టబంధన ద్రవ్యారాధన

పున్నమ్మతోట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: పున్నమ్మ తోటలోని తితిదే కల్యాణ మండపం ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడాళ్వార్ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అంగహోమం, అక్షిమోచనం, పంచగవ్య, క్షీర, జలాధివాసాలు, ఆదివాస హోమాలు, అష్టబంధన ద్రవ్యారాధన, గరుడబింబ స్థాపన, మహాశాంతి తిరుమంజనం, మహా శాంతి హోమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీ బ్రాహ్మణ వీధిలో సద్గురు రాఘవేంద్ర స్వామి బృందావన్ సేవా సమితి ఆధ్వర్యంలో రాఘవేంద్ర గురుసార్వభౌముల వారి 355వ ఆరాధన మహోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి సేవా సమితి సభ్యుల పర్యవేక్షణలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

కలెక్టరేట్‌కు తరలిరండి



ప్రచార యాత్రలో కాశీనాథ్, కృష్ణ తదితరులు

కృష్ణలంక: ఇళ్ల పట్టాలు, రిజిస్ట్రేషన్ సమస్యలపై సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమం జయప్రదం చేయాలంటూ ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో 22వ డివిజన్‌లో ప్రచార యాత్ర నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో కూటమి నాయకులు రణదివేనగర్‌లోని నివాసితులకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారని..ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కరకట్ట పరిధిలోని ఇళ్లకు పట్టాలు ఇవ్వలేదన్నారు. రక్షణ గోడ నిర్మాణం అనంతరం ఇళ్లకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. ఆయా సమస్యలపై తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కోరాడ రమణ, కుమార్, రాజాన అప్పలనాయుడు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో చేపట్టిన విద్యుత్తు లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా 22వ డివిజన్ పరిధిలో సోమవారం కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఈఈ కేవై కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సతీష్ కుమార్ రోడ్డు, ఆనంద భవన్ రోడ్డు, బైరెడ్డి వారి వీధి, గంగానమ్మ గుడి రోడ్డు, పాత పోస్టాఫీసు రోడ్డు, భ్రమరాంబపురం, సర్వీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. 20వ డివిజన్ ద్వారకా నగర్ మొదటి, రెండవ లైన్లు, నెహ్రూనగర్ మొదటి నాలుగు లైన్లు, డొంక రోడ్డు, ఇందిరా కాలనీ, రణదివే నగర్ కట్ట, సత్యంగారి దొడ్డి తదితర ప్రాంతాల్లో 9 నుంచి 10 గంటల వరకూ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన తెలిపారు.

స్తంభాలు తొలగించండి బాబోయ్..



ఎన్టీఆర్ కాలనీ నాలుగో రోడ్డులో కొంత కాలంగా విద్యుత్తు స్తంభాలను దారి పక్కగా దించారు. వీటిపై ఆకతాయిలు కూర్చుని అటుగా వెళ్లే యువతులపై అసభ్యంగా ప్రవర్తించడం, రాత్రి వేళ గంజాయి సిగరెట్లు తాగుతున్నారు. అవసరంలేని ఈ స్తంభాలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

తాగునీరు వృథా



కరెన్సీ నగర్ కడియాల రామకృష్ణారావు వీధిలో తాగునీటి పైపు నుంచి ధారాళంగా నీరు పోతోంది. రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నీరంతా మురుగు కాలువలోకి చేరుతోంది. శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదు. సంబంధిత అధికారులు దృష్టి పెట్టి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కరెన్సీనగర్**

రోడ్లను మూసేసినా పట్టించుకోరా



రాణిగారి తోట 17వ డివిజన్‌లోని పలు వీధులు ఆక్రమణలకు లోనవడంపై పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణదారులు కొందరు కనీసం పాదచారుల రాకపోకలకు కూడా అవకాశం లేని విధంగా రహదారికి మధ్యలో ఇసుక, కంకర కుప్పలను పోస్తున్నారు. శాంపిల్ భవన్ సమీపంలో రెండు వారాలుగా రోడ్డును భవన నిర్మాణ సామగ్రితో నింపినప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగం స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. - **న్యూస్‌టుడే, కృష్ణలంక**

పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు



చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న సర్వీస్ రోడ్డులో రామవరప్పాడు రింగ్ సమీపంలోని కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు నెలకొన్నాయి. ఇవి ప్రవాహానికి అడ్డుగా మారాయి. వీటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, విజయవాడ సిటీ**

నూతన కార్యవర్గం ఎన్నిక

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం లారీ యజమానుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం 40వ డివిజన్‌లోని లారీస్టాండులో ఆదివారం జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షులుగా చిన్నసుబ్బయ్య, అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా సత్యనారాయణరెడ్డి, కోశాధికారిగా కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రోడ్లపై పశువులు.. ప్రమాదాల బారిన ప్రజలు

న్యూస్‌టుడే, భవానీపురం

నగరంలోని తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాల్లోని పలు ప్రధాన, అంతర్గత రహదారుల్లో ఆవుల సంచారం ఎక్కువైంది. వీటి కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు పశుపోషకులు వీటిని రోడ్లపైకి వదిలేస్తున్నారు. ఆహారం నిమిత్తం రహదారులు, మార్కెట్లు, రైతుబజార్లు, తదితర ప్రాంతాలకు వెళ్తున్నాయి. ప్రస్తుతం నగర వ్యాప్తంగా ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఇవి పెద్ద సంఖ్యలో రోడ్లపై తిరుగుతూ పాదచారులు, వాహన చోదకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోడ్డుపైనే ఇవి ఒకదానితో ఒకటి కుమ్ములాడుకుంటూ.. రోడ్లపై పరుగులు తీస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒక్కోసారి వాహనాలు అదుపులోకి రాక ప్రమాదాల బారినపడి చనిపోతున్నాయి. అలాగే వాహనాలు ఢీకొని ఆవులు సైతం గాయపడుతున్నాయి. ఆ తర్వాత వాటి సంరక్షణ గురించి పట్టించుకునే నాథులే కరవయ్యారు.



వన్‌టౌన్‌లో రహదారిపై తిరుగుతున్న ఆవులు

ఈ నెల 16న దుర్గగుడిలో విధుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తున్న హోంగార్డు తంగెళ్లమూడి రాజశేఖర్(48) భవానీపురం స్వాతి రోడ్డులో ఆవులు అడ్డు రావటంతో కిందపడిపోయారు. తలకు గాయం కావటంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 24వ తేదీన చనిపోయారు. ఆవులు అడ్డు వచ్చిన కారణంగానే రాజశేఖర్ చనిపోయినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.

ప్రకటనలకే పరిమితం .. పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవటం లేదు. రహదారులపై ఉండే పశువులను పట్టుకుని గోశాలకు తరలిస్తామని చెప్పినా పశుపోషకులు స్పందించడం లేదు. అడపాదడపా నగరపాలక సంస్థ అధికారులు నిర్వాహకులపై కేసులు నమోదు చేసి మొబైల్ కోర్టుల్లో జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు.

ఎక్కడెక్కడ ఎక్కువగా ఉన్నాయంటే..

✶ పశ్చిమ నియోజకవర్గంలోని బ్రాహ్మణ వీధి, కె.టి.రోడ్డు, వన్‌టౌన్, భవానీపురం, విద్యాధరపురం ✶ మధ్య నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌టీఎస్ రోడ్డు, సత్యనారాయణపురం, సింగ్ నగర్, మధురా నగర్ ✶ తూర్పు నియోజకవర్గంలోని పటమట, కృష్ణలంక, రామలింగేశ్వరనగర్, తదితర ప్రాంతాలు.

చిరు వ్యాపారులకు చేయూత



దుకాణం వద్ద జయప్రకాశ్ తదితరులు

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: క్రీస్తురాజపురంలో నివాసం ఉంటున్న ఓ కుటుంబం ఉపాధి పొందేందుకు వైఎస్ఆర్ చారిటీస్ ఛైర్మన్ యలమంచిలి జయప్రకాశ్ చెప్పులు దుకాణం పెట్టుకునేందుకు ఆదివారం బడ్డీ బంకు ఏర్పాటు చేశారు. చిరు వ్యాపారాలకు తమ వంతుగా ఆర్థిక సాయాన్ని అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యలమంచిలి నిలాన్ష్ బాబు, నూతక్కి రాంప్రసాద్, కలపాల అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే.. రాకపోకలు ఎలా?



ఎనిమిదో డివిజన్‌లోని మున్సిపల్ ఎంప్లాయీస్ కాలనీలోని ఎ ప్లస్ కన్వెన్షన్ సమీపంలో ఫుట్‌పాత్ పక్కన తాగునీటి పైపు లీకైంది. దీంతో సిబ్బంది మరమ్మతులు చేసే క్రమంలో తవ్వారు. బాగుచేసిన తర్వాత వదిలేశారు. దీంతో రాకపోకలు కొనసాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, మొగల్రాజపురం (విజయవాడ సిటీ)**

కరాటేతో ఆత్మస్థైర్యం

పటమట, న్యూస్‌టుడే: కరాటేలో శిక్షణ పొందడం ద్వారా శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక దృఢత్వం, ఆత్మస్థైర్యం పెంపొందుతాయని తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. పటమట సోనోవిజన్ షోరూమ్ సమీపంలోని కరాటే శిక్షణ శిబిరంలో ఆదివారం నిర్వహించిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కరాటే వంటి క్రీడల్లో శిక్షణ పొందడం ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. కరాటేలో శిక్షణ ఇస్తున్న బ్రహ్మానందంతోపాటు తమ పిల్లలను శిక్షణకు పంపుతున్న తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పి.మల్లేశ్వరరావు, కిలారి నాగశ్రీనాథ్, సిహెచ్.పూర్ణ, ఉప్పాడ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతర

కృష్ణలంక, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆకాంక్షించారు. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో రాణిగారి తోట 18వ డివిజన్‌లో నెలకొన్న కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల జాతరలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజల అనంతరం మాట్లాడుతూ డివిజన్‌లో నివసిస్తున్న వడ్డెర సంఘీయులు ఏటా ఐక్యతతో వేడుకను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంఘం నాయకులు వేముల దుర్గారావు, ఉప్పు రాంబాబు, వి.ఎల్లయ్య, మైలమూరి పీరుబాబు, రాయి రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపరెడ్డి సేవలు మరువలేం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న చిన్నపరెడ్డి సేవలను మరువలేమని రాష్ట్ర ఆడిట్ సంచాలకులు ఈదర కల్యాణి అన్నారు. సోమవారం చిన్నపరెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆదివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆడిట్ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆడిట్ సంచాలకులు కల్యాణి మాట్లాడుతూ చిన్నపరెడ్డి యువతతో పోటీపడి పనిచేశారని అన్నారు. ఆడిట్ శాఖలోని పలు సమస్యలను ఆయన చాలా సులువుగా పరిష్కరించేవారని గుర్తు చేశారు. తెలంగాణ ఆడిట్ శాఖ మాజీ ఉపసంచాలకులు వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. గుంటూరు, విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆడిట్ సంచాలకులు కల్యాణి

మిస్టరీగా వ్యాపారి అదృశ్యం కేసు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వ్యాపారి అదృశ్యం కేసు మిస్టరీగా మారింది. తెనాలి గ్రామీణ పోలీసులు ఆదివారం తెలిపిన సమాచారం మేరకు విజయవాడకు చెందిన 53 సంవత్సరాల కోటి నాగవీరయ్య పాలిష్ తయారీ, విక్రయ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భార్యాపిల్లలతో విజయవాడలోనే నివసించేవారు. ఈ క్రమంలోనే ఆయనకు స్థానిక మహిళతో పరిచయం ఏర్పడింది. రెండేళ్ల నుంచి ఆమెతో కలిసి తెనాలిలో నివసిస్తున్నారు. రెండు నెలల క్రితం వ్యాపారాన్ని కూడా తెనాలికి మార్చేసి ఇక్కడే ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం భోజనం చేసి ద్విచక్ర వాహనంపై దుకాణానికి బయలుదేరారు. రాత్రి సిబ్బంది ఇంటికి వచ్చి షాపు తాళాలు ఇచ్చి, యజమాని మధ్యాహ్నం నుంచి రాలేదని చెప్పారు. దీంతో ఆ మహిళ రాత్రంతా అతని కోసం పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆదివారం ఉదయం ఆటోనగర్ మార్గంలోని శ్మశానం, చెరువు పరిసరాల్లో రోడ్డు వెంబడి నాగవీరయ్య వాహనం, చెప్పులు ఉన్నట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిని ఎవరో కారులో ఎక్కించుకుని వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. కిడ్నాప్ ఏమైనా జరిగిందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. విజయవాడకు చెందిన భార్య, తన భర్త ఇంటికి రాకుండా తెనాలిలో మరో మహిళతో సహజీవనం చేస్తున్నట్లు గతంలో విజయవాడలోని ఆర్ఆర్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం తెనాలి గ్రామీణ సర్కిల్ కార్యాలయానికి భార్య, సహజీవనం చేస్తున్న మహిళ, వారి బంధువులు వచ్చారు. పోలీసులు వారందరినీ విచారించారు. దర్యాప్తు కొనసాగుతోంది.

స్పందన: ★ చిలుకూరుకు సరఫరా అవుతున్న తాగునీటిలో మలినాలు వస్తున్నాయని గ్రామస్థులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. స్పందించిన గ్రామ కార్యదర్శి శ్రీకాంత్ పంచాయతీ సిబ్బందితో గ్రామంలోని రెండు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. ★ కేశవకొండ ఎస్సీ ఆర్ కాలనీలోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికులు గ్రామ కార్యదర్శి సరోజిని దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె ప్రత్యేక సిబ్బందితో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. ★ కొత్తకాపుపాలెంలో నడి రోడ్డుపై వెళ్లే దారిలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు గ్రామ కార్యదర్శి బాషాకు చెప్పారు. ఆయన స్పందించి దీపాలు వేయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం
★ తిరువూరు 9వ వార్డులోని వీధి వెంట చుట్టు పక్కల పిచ్చి మొక్కలు పెరిగాయని స్థానికురాలు సత్యవతి సమస్యను అధికారులకు చెప్పారు. స్పందించిన శానిటరీ అధికారి ప్రత్యేక సిబ్బందిని పంపి శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు.
★ తిరువూరు 15వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు కేశవరావు సమస్యను అధికారులకు తెలిపారు. శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించారు.
- న్యూస్‌టుడే, తిరువూరు

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెందిన తూమాటి మస్తానయ్య, వెంకాయమ్మ కుమారులు ధూళిపాళ్ల మాసన, వెల్లి మాధవి రూ.లక్ష విరాళం అందజేశారు.

కూరగాయల ధరలు

టమాట 27, వంగ 24, పచ్చి, బజ్జీ మిర్చి 29+35, బెండ 14, కాకర 26, బీర నాటు, పందిరి 24+30, క్యారెట్ 42, గోరుచిక్కుడు 20, ఉల్లిపాయలు 50, చామ 36, చిక్కుడు జంక్షన్, నాటు 24+34, మునగ 6+5, బీన్స్ 92, బీట్‌రూట్ 42, కంద 36, కీరదోస 50, సొరకాయ 10+8, ఆలుగడ్డ 8+7, దోస 16, పొట్లకాయ 20+15, నిమ్మకాయలు డజన్ 60+48, ఉసిరికాయ చిన్న 6+3, దొండ 26, క్యాబేజీ 26, బంగాళదుంప 26, క్యాప్సికం 52, చిలకడదుంప 48, కొత్తిమీర 20+10, పుదీనా 15+5, అల్లం పాత, కొత్తది 183+83, వెల్లుల్లి 189, అకాకరకాయ 140. - న్యూస్‌టుడే, తిరువూరు

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ఇంటింటికీ తెలుగుదేశం

కొండపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి ఒక్కరూ సుఖ సౌఖ్యాలతో ఉంటున్నారని పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను అన్నారు. కొండపల్లి రైల్వేకాలనీ, గీతా మందిర్ రోడ్డు ప్రాంతాల్లో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా కూటమి పాలన సాగుతుందని చెప్పారు. నిబద్ధతతో తెదేపా రాష్ట్రంలో ముందుకెళ్తూ.. ఎన్నికల హామీలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పుల్లు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళకు కరపత్రం ఇస్తున్న తెదేపా నాయకులు

విజ్ఞానం.. ప్రగతికి సోపానం

తిరువూరు, న్యూస్‌టుడే

చదువుతో పాటు నైతిక విలువలు, దేశభక్తి, సేవాభావం పెంపొందించుకోవాలన్న లక్ష్యంతో తిరువూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌లో చేరారు. ఓ వైపు విద్యను అభ్యసిస్తూనే.. మరో వైపు యూనిట్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఉపాధ్యాయులు, స్థానికుల మన్ననలు పొందుతున్నారు. పాఠశాల హెచ్‌ఎం మృదుల ఆధ్వర్యంలో యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. పలువురు విద్యార్థులు ఇందులో చేరారు. వీరికి వ్యాయామ ఉపాధ్యాయురాలు సుకన్య, జయలక్ష్మి ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. విద్యార్థుల్లో బాల్యం నుంచే దేశభక్తి, జాతీయ సేవ, కృత సేవాభావం పెంపొందించడంతో పాటు ఆత్మరక్షణ, శారీరక దృఢత్వం, స్వీయరక్షణ, ప్రథమ చికిత్స, సాహస క్రీడలు తదితరాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ఈ పరిజ్ఞానం ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుందని విద్యార్థినులు అంటున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ఎంతగానో ఉపయోగ పడుతుంది.


పాఠశాల ఆవరణ శుభ్రం చేస్తున్న గైడ్స్ విద్యార్థినులు

బాధ్యతగా నడుచుకుంటున్నా..

స్కౌట్ విభాగంలో చేరడం వల్ల క్రమశిక్షణ, బాధ్యతగా నడుచుకోవడం అలవడింది. ఆత్మరక్షణ క్రీడల్లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాను. విపత్కర పరిస్థితుల్లో నన్ను నేను ఎలా రక్షించుకోవాలో నేర్చుకున్నాను. - **లక్ష్మి, 7వ తరగతి**

సామాజిక సేవ చేయాలని..

ఇందులో శిక్షణ తీసుకోవడం వల్ల నాలో సామాజిక సేవ చేయాలన్న తపన పెరిగింది. క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు, సేవాభావంతో పాటు మనోధైర్యంగా ఎలా ఉండాలనేది తెలుసుకున్నాను. - **మౌనిక, 7వ తరగతి**

స్వీయరక్షణలో పట్టు..

గైడ్స్ కోర్సుల్లో ఆత్మరక్షణకు సంబంధించిన మెలకువలు నేర్పిస్తున్నారు. పచ్చదనం పెంపు, శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ఆనందాన్ని ఇస్తోంది. - **విజయలక్ష్మి, 8వ తరగతి**

ఐపీఎస్ కావాలని..

ఇందులో చేరడం వల్ల క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలు పెరిగాయి. దీనికి తోడు ఐపీఎస్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. అందుకు తగ్గట్టు కష్టపడి చదువుతున్నాను. ఇప్పుడు నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. - **అక్షయ, 8వ తరగతి**

అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దర్శపథం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నాట్యాచారిణి ఎం. పావని శిష్యబృందం నృత్యప్రదర్శన ఆదివారం భక్తులను అలరించింది. జగన్నాథ దుర్గమ్మ కీర్తనలు, ఓం శర్వాణి, గణేశ పంచరత్నం, హిమగిరి తనయ గీతాలకు నృత్య అభినయం ఆకట్టుకుంది. ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.


ప్రదర్శనలో కళాకారులు

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ప్రతి పల్లె, మారుమూల తండాల్లోని ప్రజల మోములో చిరునవ్వు చూడడమే కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గొల్లమందల గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్నింటిని అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. దీర్ఘకాలికంగా ఉన్న వాటిని, ప్రభుత్వం సహకారంతో అవసరమైన నిధులు సమకూర్చి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలం గానుగపాడుకు చెందిన మోదుగు శ్రీజ విజయవాడలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో సీటు సాధించారు. ఆర్థికంగా వెనుకబడిన తన కుటుంబ పరిస్థితిని ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రూ.30 వేల నగదును ఆదివారం అందజేశారు. తమ కుమార్తె చదువుకు సాయం అందించిన ఎమ్మెల్యేకు ఆమె తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

విస్సన్నపేట(గంపలగూడెం), న్యూస్‌టుడే : విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన మల్లాది సోనీ అనే విద్యార్థిని ఉన్నత చదువు కోసం ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆదివారం రూ. 35 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రాష్ట్రానికి చేరుకున్న ఉపాధ్యాయ బృందం

విస్సన్నపేట(గంపలగూడెం), న్యూస్‌టుడే : ఫిన్లాండ్ పర్యటనకు వెళ్లిన ఉత్తమ ఉపాధ్యాయ బృందం ఆదివారం రాష్ట్రానికి చేరుకుంది. ఇందులో విస్సన్నపేట మండలం నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బీవీ.శ్రీధర్ బాబు కూడా ఉన్నారు. రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ తమీమ్ అన్సారియా పర్యవేక్షణలో ఫిన్లాండ్‌లో పర్యటించి, అక్కడ అమలు చేస్తున్న విద్యా విధానంలో పలు అంశాలను సర్వే చేశామని శ్రీధర్‌బాబు తెలిపారు. అక్కడి తుర్కు విశ్వవిద్యాలయం నుంచి ప్రశంసాపత్రం, ధ్రువపత్రం తమకు అందజేశారని చెప్పారు.


తమీమ్ అన్సారియా నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీధర్‌బాబు

పరిటాల సేవలు చిరస్మరణీయం

మైలవరం(జి.కొండూరు), న్యూస్‌టుడే : దివంగత మాజీ మంత్రి పరిటాల రవి జయంతిని మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మైలవరం ఎమ్మెల్యే కార్యాలయంలో రవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు తమ్ముళ్లు

పోలింగ్ కేంద్రాల్లో తనిఖీలు

విస్సన్నపేట(గంపలగూడెం), న్యూస్‌టుడే : విస్సన్నపేటలోని ఎనిమిది పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాలను ఏఈఆర్వోగా ఉన్న తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి తనిఖీ చేశారు. ఓటర్ల చేరికకు కొత్తగా అందిన దరఖాస్తులు తదితర వివరాలపై బూత్ స్థాయి అధికారులను ఆరా తీశారు. చేర్పులు, మార్పులు, సవరణలకు సంబంధించి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.


ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీకల్యాణి

మసీదు పవిత్రత కాపాడతాం

తిరువూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని జామియా మసీదు ఎన్నికల్లో షేక్ హుస్సేన్ గెలుపొంది నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులందరి సమన్వయంతో మసీదు అభివృద్ధికి నిధులను సేకరించడానికి కృషి చేస్తానని తెలిపారు. మత పెద్దల సలహాలు, సూచనలు తీసుకుంటూ మసీదు పవిత్రతను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపడతానని పేర్కొన్నారు. తన విజయానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతమ్మ ఆలయానికి భక్తుల రాక

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుంచి ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. స్థానిక మునేరులో స్నానమాచరించి అమ్మవారికి పాల పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామ దేవత ముత్యాలమ్మకు బోనాల సమర్పణ


కనుమూరులో గ్రామస్థుల సందడి


కోమటిగుంటలో...

గంపలగూడెం, న్యూస్‌టుడే : శ్రావణ మాసం సందర్భంగా గంపలగూడెంలో గ్రామ దేవత ముత్యాలమ్మ తల్లికి గ్రామస్థులు బోనాలు సమర్పించారు. ఉదయం మేళతాళాలతో గ్రామరాశి బోనం అమ్మవారికి అందించారు. కనుమూరులో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : కొత్త రెడ్డిగూడెం గ్రామంలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.


గంపలగూడెంలో అమ్మవారు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : శ్రావణ మాసం సందర్భంగా మండల పరిధిలోని చీమలపాడు, రామచంద్రాపురం, పోలిశెట్టిపాడు, కంభంపాడు, గొల్లమందల, మాధవరం, రేపూడి, కోడూరు గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ తల్లి గుడిలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

జి.కొండూరు, న్యూస్‌టుడే : వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో భక్తులు ఆదివారం గంగానమ్మ దేవతకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు మేళాతాళాలతో కుండలో కప్పలను ఊరేగించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.


ఊరేగింపులో నీరు పోసుకుంటున్న భక్తులు

సామర్థ్యానికి మించి ఇసుక తరలింపు

ఇసుక తరలించే టిప్పర్లతో ప్రమాదం పొంచి ఉంది. భారీగా లోడు చేసుకుని రోడ్లపై వేగంగా దూసుకెళ్తున్న వాటిని చూసి ఎదురుగా వచ్చే వాహనదారులు, గ్రామాల్లో ప్రజలు భయపడుతున్నారు. సామర్థ్యానికి మించి లారీలో క్యాబిన్ టాప్ కంటే ఎత్తుగా ఇసుక లోడు చేసుకుని విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, ఎ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు మండలాల మీదుగా పలు గ్రామాలకు ఇసుక తరలిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గంపలగూడెం



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయరూ..



ఆర్‌అండ్‌బీ రహదారుల్లో ప్రమాదకర మలుపుల దగ్గర హెచ్చరిక బోర్డులు లేక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నూజివీడు-గంపలగూడెం రోడ్డులో మిట్టగూడెం సమీపంలోని చెరువుల దగ్గర, విజయవాడ- విస్సన్నపేట రహదారిలో రాఘవాపురం పాల కేంద్రం- 2 దగ్గర, జడ్పీ ఉన్నత పాఠశాల దగ్గర మలుపులు ఉన్నాయి. అధికారులు ఆయా ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించి, ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

అధ్వానంగా పారిశుద్ధ్యం

తిరువూరు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. కాలనీలో చెత్తచెదారం పేరుకుపోవడంతో మురుగు నిలిచి దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహాల మధ్య పందుల సంచారం కూడా ఎక్కువ అయ్యిందని, అసలే వర్షాకాలం కావడంతో దుర్వాసన వెదజల్లుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తిరువూరు



అభివృద్ధికి నోచుకోక.. రాకపోకలు సాగించలేక..



పంట పొలాలు, మామిడి తోటలకు వెళ్లే డొంక రోడ్లు అభివృద్ధికి నోచుకోక పోవడంతో అన్నదాతలు ఇక్కట్లు పడుతున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలతో గోతులు పడి రాకపోకలు సాగించాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. వీబీజీ రామ్‌జీ పథకంలోనైనా డొంక రోడ్లను బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

చెక్‌డ్యామ్‌పై ప్రవహించిన వరద

మండలంలోని గోసవీడు శివారు గంగదేవిపాడు చెక్‌డ్యామ్‌పై వరద నీరు ప్రవహించింది. వర్షాభావంతో కట్లేరుకు వరదలు రాకపోవడంతో ఇప్పటి వరకు డ్యామ్ వెలవెలబోయింది. వరద నీరు డ్యామ్ వద్ద నిల్వ ఉండడంతో ఆయకట్టుకు సాగు నీరు లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, గంపలగూడెం



పొంచి ఉన్న ఆపద



ఎ.కొండూరు మండల పరిధిలోని మాధవరం శివారు మిర్యాతండాలో విద్యుత్తు నియంత్రిక ఉన్న స్తంభం ప్రమాదకరంగా మారింది. దాని చుట్టూ, సపోర్టు తీగకు ముళ్ల పొదలు, తీగలు అల్లుకున్నాయి. గతంలో ఇక్కడ విద్యుత్తు ప్రమాదం చోటు చేసుకుని మేకలు, పశువులు మృతి చెందాయని స్థానికులు తెలిపారు. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి చెట్లను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎ.కొండూరు

ప్రమాదకరంగా పట్టిసీమ వంతెన



వెలగలేరు గ్రామ శివారులో పోలవరం కుడి ప్రధాన కాలువ పట్టిసీమపై నిర్మించిన వంతెన దుస్థితికి చేరింది. విస్సన్నపేట- విజయవాడ ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారిలో భాగమైన ఈ వారధిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో వంతెనపై గుంతలమయమై ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

మామిడి కాయలు కోస్తుండగా విద్యుదాఘాతం.. వ్యక్తి మృతి

భవానీపురం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వ్యక్తి చనిపోయినట్లుగా భవానీపురం పోలీసులు తెలిపారు. భవానీపురం శివాలయం వీధిలో గుండా మల్లీశ్వరి, గుండా శ్రీనివాసరావు(54) దంపతులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసరావు గొల్లపూడిలోని టోకు వ్యాపార కేంద్రంలో గుమస్తాగా పని చేస్తున్నారు. ఈనెల 30న ఉదయం శ్రీనివాసరావు, మల్లీశ్వరి, యజమాని విశ్వనాథశర్మ ముగ్గురు కలిసి ఇంటి ఆవరణలో మామిడి కాయలు కోస్తున్నారు. శ్రీనివాసరావు 12 అడుగుల స్టీల్‌రాడ్‌తో మామిడి చెట్టు కొమ్మ చివర ఉన్న మామిడి కాయలు కోస్తుండగా కొమ్మకు ఆనుకుని ఉన్న 11 కె.వి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు స్టీల్ రాడ్ తగిలింది. దీంతో శ్రీనివాసరావు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయారు.

కారు ఢీ.. బాలుడికి గాయాలు

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే : కారు ఢీకొన్న ఘటనలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధి జుజ్జూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై బి.అభిమన్యు తెలిపిన వివరాల మేరకు.. కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామానికి చెందిన డక్కమడుగుల అంకమ్మరావు జుజ్జూరు గ్రామంలోని భార్య తరపున బంధువుల ఇంటికి దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. అంకమ్మరావు చిన్న కుమారుడు హేమంత్ కంచికచర్ల-మధిర ప్రధాన రహదారి దాటే క్రమంలో అల్లూరు వైపు నుంచి విజయవాడకు వెళ్తున్న కారు అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు కంచికచర్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాలుడికి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జూద శిబిరంపై పోలీసుల దాడి

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలం మల్లెల గ్రామంలో నిర్వహిస్తున్న జూద శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.16,650 నగదు, జూదానికి ఉపయోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శాతకర్ణి తెలిపారు. జూదం వల్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటాయని సూచించారు. ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

జి.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని గుర్రాజుపాలెం శివారులో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. జాతీయ రహదారి- 30 సమీపంలో లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న కంప చెట్ల మధ్య ఓ పురుషుడి మృతదేహం పడి ఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జి.కొండూరు ఎస్సై సతీష్ కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికులను విచారించగా నెల రోజులుగా ఆ వ్యక్తి చుట్టు పక్కల ప్రాంతంలో యాచన చేస్తూ తిరుగుతున్నాడని తెలిపారు. దీంతో మృతుడిని యాచకుడిగా గుర్తించారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి, మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉండడంతో అక్కడికక్కడే ఖననం చేసినట్లు ఎస్సై తెలిపారు.

కచ్చితమైన సమాచారం అందిస్తే బహుమతులు

తిరువూరు: మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు డ్రగ్స్‌కు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని పోలీసులకు అందించేందుకు తిరువూరు పోలీసులు ఈగల్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్లేడ్, గంజాయి బ్యాచ్ అంటూ ఎవరిపైనా అపోహలు పెట్టుకోవద్దని, వీటిని వినియోగించే వారిని గుర్తించి కచ్చితమైన సమాచారం అందించిన వారికి తగిన బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు, ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పోలీసులు

రసాయన వ్యర్థాలతో.. పంటలకు ముప్పు

<u>మైలవరం(జి.కొండూరు), న్యూస్‌టుడే</u>

మైలవరం మండలంలోని కీర్తిరాయునిగూడెం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బాటిల్ వాషింగ్ కంపెనీ నుంచి విడుదలవుతున్న రసాయన వ్యర్థ జలాలతో పంట పొలాలు దెబ్బతింటున్నాయని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన రామకృష్ణ, శ్రీనివాసరావు, సాంబశివరావు, నాగరాజు తదితరులు పంట కాలువ వెంబడి పొలాల్లో వరి పంట వేశారు. రెండేళ్ల కిందట గ్రామ శివారులో ఎస్‌ఆర్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో బాటిల్ వాషింగ్ కంపెనీ ఏర్పాటు అయ్యింది. ఇందులో ఖాళీ మద్యం సీసాలు రీసైక్లింగ్ చేసేందుకు పలు రకాల రసాయనాలు వాడుతుంటారు. వీటిని శుభ్రం చేసిన అనంతరం వెలువడే రసాయన వ్యర్థ జలాలను నేరుగా సమీపంలోని పంట కాలువల్లోకి విడుదల చేస్తుంటారు. వాన, చెరువుల నుంచి వచ్చే నీరు ఈ కాలువ ద్వారానే పొలాలకు ప్రవహిస్తుంటుంది. రైతులు ఆ నీటి ఆధారంతోనే వరి సాగు చేపడతారు.


పొలంలో పాడైన వరి దుబ్బులు చూపుతున్న రైతులు

★ **దిగుబడి తగ్గుతోంది..:** సదరు కంపెనీ నుంచే విడుదలయ్యే రసాయన వ్యర్థ జలాలు పంట కాలువలోకి చేరడంతో నీరంతా కలుషితమవుతోందని, పంట దెబ్బతింటోందని కర్షకులు వాపోతున్నారు. వరి ఎర్ర పడడం, దుబ్బులు ఎండిపోవడం, కుళ్లిపోవడం జరుగుతోందని ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో పంట దిగుబడి తగ్గడంతో పాటు పెట్టుబడి కూడా నష్టపోతున్నామని విచారం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కంపెనీ నిర్వాహకులను ప్రశ్నించగా తమపై దాడులకు దిగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రసాయన వ్యర్థ జలాలు పంట కాలువలో కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాలుష్య నియంత్రణ మండలి శాఖ వారు కంపెనీలో తనిఖీలు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విజయవాడ పశ్చిమ

రెవెన్యూ సమస్యలపై ఫోన్ ఇన్ నేడు

ఈనాడు తోడుగా


షేక్.ఇస్మాయిల్ (పశ్చిమ తహసీల్దారు)

పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పట్టాల సమస్యలు ఎక్కువగా ఉంటాయి. అలాగే ప్రభుత్వపత్రాలు, సర్వేలో సమస్యలను ప్రజలు ఎదుర్కొంటుంటారు. ఆ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని పశ్చిమ తహసీల్దారు షేక్.ఇస్మాయిల్ కోరుతున్నారు. అందుకు 'ఈనాడు' తన వంతు బాధ్యతగా పశ్చిమ తహసీల్దారుతో ఫోన్ ఇన్‌ను సోమవారం నిర్వహిస్తోంది. ప్రజలు ఆయనతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలు తెలియజేయొచ్చు. -న్యూస్‌టుడే, భవానీపురం

తేదీ : 31-08-2026 సోమవారం ఉదయం 10.30- 11.30 గంటల వరకు.. ఫోన్ నంబరు: 80085 74638

నగరపాలక సంస్థ కార్యాలయంలో పీజీఆర్ఎస్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో నివాసం ఉండే ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

సర్కారు బడిలో సౌకర్యాలెక్కడ?

అపరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఇరుకు గదులు

తాగునీరు కూడా లేక విద్యార్థుల అవస్థలు

- న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్, భవానీపురం

కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఇంకా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

★ కొత్తపేట చేపల మార్కెట్‌లో ఉన్న బసవ అప్పస్వామి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 28మంది విద్యార్థులు ఉండగా, కేవలం రెండు చిన్న గదులే ఉన్నాయి. వాటిలో ఒకదాన్ని స్టోర్‌రూమ్‌గానూ వినియోగిస్తున్నారు. విద్యార్థులకు ఒక్కటే చిన్న మరుగుదొడ్డి ఉంది.


ఉన్నత పాఠశాల తరగతి గదులు ఇరుకుగా..


జక్కంపూడికాలనీలోని పాఠశాలలో మూలకు చేరిన ఆర్‌వో ప్లాంట్

★ కొత్తపేట శ్రీఅన్నపూర్ణదేవి ఉన్నత పాఠశాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక్కడ 1 -5 తరగతుల వరకు 210మంది విద్యార్థులు ఉండగా, కేవలం నాలుగే తరగతి గదులున్నాయి. ఒక్కో గదిలో 20 మంది కూర్చున్నా ఇరుకుగా ఉండే పరిస్థితి నెలకొంది. 6- 10 వరకు 320మంది విద్యార్థులకు కేవలం ఏడే గదులున్నాయి. 1నుంచి పదో తరగతి వరకు విద్యార్థులందరికీ ఒక్కటే మరుగుడ్ల సముదాయం ఉండగా... అవి కూడా చాలా ఇరుకుగా ఉన్నాయి. విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

★ భవానీపురం, జక్కంపూడికాలనీలోని పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. అవి కూడా అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీరు అందించే పరిస్థితి లేదు. గతంలో పాఠశాల్లో శుద్ధి చేసిన నీటిని అందించేందుకు ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం అవి మూలకు చేరాయి. అధికారులు వాటికి మరమ్మతులు చేయించేందుకు దృష్టి సారించడం లేదు. విద్యార్థులు ఇంటి వద్ద నుంచే బాటిళ్లలో నీటిని తెచ్చుకోవాల్సి వస్తుంది. పాఠశాలలో కుళాయిల వద్ద నీరు తాగలేని పరిస్థితి నెలకొంది.

★ కరకట్ట ప్రాంతంలో ఉన్న ఎస్.ఎం.ఎ. ఖుద్దూస్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుద్ధిచేసిన నీటిని అందించే పరిస్థితి లేదు. ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో కలిపి మూడు వందల మందికి పైగా విద్యార్థులున్నారు. వారందరికీ సరిపడా మరుగుదొడ్లు లేవు. ★ ఆకులరాజేశ్వరరావు రోడ్డులో ఉన్న కసుమర్తి సుబ్బారావు పాఠశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ★ హెచ్‌బీకాలనీలో ఉన్న మోహన్‌లాల్ చంద్రభాను పాఠశాలలో అరకొర గదులు, అపరిశుభ్రమైన మరుగుదొడ్లతో విద్యార్థులకు సమస్యగా మారింది. ★ ఊర్మిళానగర్‌లోని సిద్ధం కృష్ణారెడ్డి నగరపాలక సంస్థ పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్ మూలకు చేరింది. ★ జక్కంపూడికాలనీలోని ఉన్నత పాఠశాలలోని ఆర్‌వో ప్లాంట్ వినియోగంలో లేదు. గతంలో వచ్చిన వరదల కారణంగా ప్లాంట్ పాడైంది. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? కేదారేశ్వరపేట అంబేడ్కర్ విగ్రహం ప్రాంతంలో చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. - **ప్రభాకర్, స్థానికుడు** ✔ సిబ్బందితో చెత్తను సేకరించేందుకు చర్యలు చేపడతాం. - **అన్నపూర్ణ, ఏఎంవోహెచ్, సర్కిల్-2** ? సీవీఆర్ పైవంతెన మార్గంలో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. - **రాజేంద్ర, స్థానికుడు** ✔ వాటిని పూడ్చేందుకు చర్యలు చేపడతాం. - **శ్రీనివాస్, సర్కిల్-1 ఈఈ** ? కొత్తపేట కుమ్మరివీధుల ప్రాంతంలో చెత్తను రోడ్డుపైనే వేస్తున్నారు. - **రజియా, స్థానికురాలు** ✔ సిబ్బందితో చెత్తను తరలించేందుకు చర్యలు చేపడతాం. - **చెన్నారాజు, స్థానిక శానిటరీ అధికారి**

స్పందన: ✦ కొత్తపేట బ్రహ్మంగారి మఠం ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు సిబ్బందితో వాటిని పట్టించారు. ✦ కొత్తపేట విజయ బేకరీ ప్రాంతంలో రోడ్లపై చెత్త వేస్తున్నారని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్తను తరలించారు. – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

బోనాల జాతర

కృష్ణలంక, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆకాంక్షించారు. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో రాణిగారి తోట 18వ డివిజన్‌లో నెలకొన్న కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల జాతరలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజల అనంతరం మాట్లాడుతూ డివిజన్‌లో నివసిస్తున్న వడ్డెర సంఘీయులు ఏటా ఐక్యతతో వేడుకను నిర్వహించడం అభినందనీయమన్నారు. సంఘం నాయకులు వేముల దుర్గారావు, ఉప్పు రాంబాబు, వి.ఎల్లయ్య, మైలమూరి పీరుబాబు, రాయి రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న రాష్ట్ర ఆడిట్ సంచాలకులు కల్యాణి

చిన్నపరెడ్డి సేవలు మరువలేం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న చిన్నపరెడ్డి సేవలను మరువలేమని రాష్ట్ర ఆడిట్ సంచాలకులు ఈదర కల్యాణి అన్నారు. సోమవారం చిన్నపరెడ్డి ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఆదివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆడిట్ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఆడిట్ సంచాలకులు కల్యాణి మాట్లాడుతూ చిన్నపరెడ్డి యువతతో పోటీపడి పనిచేశారని అన్నారు. ఆడిట్ శాఖలోని పలు సమస్యలను ఆయన చాలా సులువుగా పరిష్కరించేవారని గుర్తు చేశారు. తెలంగాణ ఆడిట్ శాఖ మాజీ ఉపసంచాలకులు వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

భవానీపురం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే విద్యార్థులకు ఉత్తమ బోధన అందించవచ్చని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య పేర్కొన్నారు. ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీలోని వివిధ సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు జక్కంపూడిలోని డోకుపర్తి ఉపేంద్ర హైస్కూల్ వేదికగా ఆదివారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ.. శతాబ్దానికిపైగా చరిత్ర కలిగిన కమిటీలో 8 విద్యాసంస్థల్లో 12వేల మందికిపైగా విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల మధ్య ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు దోహదం చేస్తాయని తెలిపారు. కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, 700మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని పేర్కొన్నారు. కమిటీ కోశాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. విజేతలకు 5వ తేదీన కళాశాలలో బహుమతులు అందిస్తామన్నారు. ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్, టగ్‌ఆఫ్‌వార్, మ్యూజికల్ ఛైర్స్, తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ పరిపాలన విభాగాధిపతి వి.నారాయణరావు, ప్రిన్సిపల్ పి.శ్యామల, కేబీఎన్ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ ఆడుతున్న కమిటీ ప్రధాన కార్యదర్శి మల్లయ్య


కరపత్రాలు పంచుతున్న బుద్దా, స్థానిక నాయకులు

పేదల సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యం అని తెదేపా పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న అన్నారు. ఇంటింటికీ తెలుగుదేశంలో భాగంగా 38వ డివిజన్‌లో కార్యకర్తలు, నాయకులతో కలిసి వెంకన్న ఆదివారం పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. పేదల కోసం అన్న క్యాంటీన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, జేఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల నిర్మాణం వంటివి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. వైకాపా అరాచక పాలనకు పూర్తి స్థాయిలో చరమగీతం పాడడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు సురభి బాలు, పీతాని పద్మ, శివశర్మ, యూసఫ్ పాల్గొన్నారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీ బ్రాహ్మణ వీధిలో సద్గురు రాఘవేంద్ర స్వామి బృందావన్ సేవా సమితి ఆధ్వర్యంలో రాఘవేంద్ర గురుసార్వభౌముల వారి 355వ ఆరాధన మహోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి సేవా సమితి సభ్యుల పర్యవేక్షణలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సేవా సమితి సెక్రటరీ నందిపాటి శివశంకరరావు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు, కోశాధికారి సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న సేవా సమితి కమిటీ సభ్యులు, శ్రీధర్


లోడింగ్ కోసం నిలిపిన లారీ

అడ్డంగా ఆపేసి.. వ్యాపారాలు

ప్రభాస్ కళాశాల ప్రధాన రహదారిలో ఆక్రమణల కారణంగా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపైనే కొందరు వ్యాపారులు ఎగుమతులు, దిగుమతులు చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వన్‌టౌన్, టూటౌన్ మధ్య నిత్యం పెద్ద సంఖ్యలో ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కేదారేశ్వరపేట

సమయం.. సమాచారం.. అన్నీ అడగాల్సిందే

పీఎన్‌బీఎస్‌లో ప్రయాణికుల అవస్థలు


బస్టేషన్‌లో యాడ్‌లతో ఉన్న బోర్డులు

న్యూస్‌టుడే, విజయవాడ బస్టేషన్

పండిట్‌నెహ్రూ బస్టేషన్‌లో బస్సుల సమాచారం తెలుసుకోవాలంటే ఇబ్బందిగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఏ బస్సు ఏ సమయానికి వస్తుందో, గతంలో బస్టేషన్‌లో ప్రతి ప్లాట్‌ఫాం వద్ద బస్సులకు సంబంధించిన సమాచారం వాటి వివరాలతో సహా పూర్తిగా పెయింటింగ్ వేసి ఉంచేవారు. కొద్ది రోజుల తర్వాత ప్లాట్‌ఫామ్‌ల వద్ద స్టిక్కర్‌లు అతికించారు. ప్రస్తుతం పీఎన్‌బీఎస్‌లో కేవలం హైకోర్టు, సచివాలయం బస్సుల సమయ వివరాలు మాత్రమే ఏర్పాటు చేశారు.

✦ పీఎన్‌బీఎస్ ఆసియాలోనే పెద్ద బస్టేషన్లలో ఒకటి. ఇక్కడ అరైవల్, డిపాశ్చర్ బ్లాక్‌లలో మొత్తం 61 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. ఇవి కాక సిటీ బస్‌పోర్ట్ ప్లాట్‌ఫామ్‌లు అదనం. బస్టేషన్‌కు నిత్యం సుమారు మూడువేల బస్సులు, దాదాపు రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే ప్రయాణ ప్రాంగణంలో బస్సుల సమాచారం ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయం, ఎన్టీఆర్ జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయం పీఎన్‌బీఎస్‌లోనే ఉన్నాయి. అధికారులందరూ ఇక్కడినుంచే నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా బస్సుల సమయం వివరాలు ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సుల సమాచారం తెలుసుకోవాలంటే సమాచార కేంద్రం వద్దకు పరుగులు తీయాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్లపై పశువులు.. ప్రమాదాల బారిన ప్రజలు

➤ ఈ నెల 16న దుర్గగుడిలో విధుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తున్న హోంగార్డు తంగెళ్లమూడి రాజశేఖర్(48) భవానీపురం స్వాతి రోడ్డులో ఆవులు అడ్డు రావడంతో కిందపడిపోయారు. తలకు గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 24వ తేదీన చనిపోయారు. ఆవులు అడ్డు వచ్చిన కారణంగానే రాజశేఖర్ చనిపోయినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు.


వన్‌టౌన్‌లో రహదారిపై తిరుగుతున్న ఆవులు

న్యూస్‌టుడే, భవానీపురం

నగరంలోని తూర్పు, పశ్చిమ, మధ్య నియోజకవర్గాల్లోని పలు ప్రధాన, అంతర్గత రహదారుల్లో ఆవుల సంచారం ఎక్కువైంది. వీటి కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు పశుపోషకులు వీటిని రోడ్లపైకి వదిలేస్తున్నారు. ఆహారం నిమిత్తం రహదారులు, మార్కెట్లు, రైతుబజార్లు, తదితర ప్రాంతాలకు వెళ్తున్నాయి. ప్రస్తుతం నగర వ్యాప్తంగా ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఇవి పెద్ద సంఖ్యలో రోడ్లపై తిరుగుతూ పాదచారులు, వాహన చోదకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రోడ్డుపైనే ఇవి ఒకదానితో ఒకటి కుమ్ములాడుకుంటూ.. రోడ్లపై పరుగులు తీస్తూ వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒక్కోసారి వాహనాలు అదుపులోకి రాక ప్రమాదాల బారినపడి చనిపోతున్నాయి. అలాగే వాహనాలు ఢీకొని ఆవులు సైతం గాయపడుతున్నాయి. ఆ తర్వాత వాటి సంరక్షణ గురించి పట్టించుకునే నాథులే కరవయ్యారు.

ప్రకటనలకే పరిమితం

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోవటం లేదు. రహదారులపై ఉండే పశువులను పట్టుకుని గోశాలకు తరలిస్తామని చెప్పినా పశుపోషకులు స్పందించడం లేదు. అడపాదడపా నగరపాలక సంస్థ అధికారులు నిర్వాహకులపై కేసులు నమోదు చేసి మొబైల్ కోర్టుల్లో జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు.

ఎక్కడెక్కడ ఎక్కువగా ఉన్నాయంటే..

- పశ్చిమ నియోజకవర్గంలోని బ్రాహ్మణ వీధి, కె.టి.రోడ్డు, వన్‌టౌన్, భవానీపురం, విద్యాధరపురం
- మధ్య నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌టీఎస్ రోడ్డు, సత్యనారాయణపురం, సింగ్ నగర్, మధురా నగర్
- తూర్పు నియోజకవర్గంలోని పటమట, కృష్ణలంక, రామలింగేశ్వరనగర్, తదితర ప్రాంతాలు

అలరించిన కూచిపూడి నృత్యం


ప్రదర్శనలో కళాకారిణులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నాట్యాచారిణి ఎం. పావని శిష్యబృందం నృత్యప్రదర్శన ఆదివారం భక్తులను అలరించింది. జగన్మాత దుర్గమ్మను కీర్తిస్తూ ఓం శర్వాణి, గణేశ్ పంచరత్నం, హిమగిరి తనయ గీతాలకు నృత్య అభినయనం ఆకట్టుకుంది. ప్రదర్శనలో పాల్గొన్న కళాకారిణులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

లారీ యజమానుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


సన్మానం అందుకున్న సభ్యులు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురం లారీ యజమానుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం 40వ డివిజన్‌లోని లారీస్టాండులో ఆదివారం జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షులుగా చిన్నసుబ్బయ్య, అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా సత్యనారాయణరెడ్డి, కోశాధికారిగా కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. లారీ యజమానుల సంక్షేమానికి చర్యలు చేపడతామని గౌరవ అధ్యక్షులు చిన్నసుబ్బయ్య పేర్కొన్నారు. నాయకులు దేవరాజు, మధు, వెంకటబాబు, యజమానులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. జనాలకు కాట్లు



స్థానిక 34వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థలాల యజమానులు పట్టించుకోకపోవడంతో వర్షాకాలంలో నీళ్లు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డివిజన్ వాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కేదారేశ్వరపేట

రెండు నెలలుగా వెలగని వీధి దీపం



పాతబస్తీ వించిపేట ఆంబోతుల వారి వీధి రామాలయం పక్కనే ఉన్న వీధి దీపం రెండు నెలలకు పైగా వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో వీధి అంధకారంతో పాదచారులు, ద్విచక్రవాహన దారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చీకటితో మహిళలు, వృద్ధులు, చిన్నారులు బయటకు రావడానికి ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని వారంతా వాపోతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

మామిడి కాయలు కోస్తుండగా విద్యుదాఘాతం.. వ్యక్తి మృతి

భవానీపురం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వ్యక్తి చనిపోయినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. భవానీపురం శివాలయం వీధిలో గుండా మల్లీశ్వరి, గుండా శ్రీనివాసరావు(54) దంపతులు అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసరావు గొల్లపూడిలోని టోకు వ్యాపార కేంద్రంలో గుమస్తాగా పని చేస్తున్నారు. ఈనెల 30న ఉదయం శ్రీనివాసరావు, మల్లీశ్వరి, యజమాని విశ్వనాథశర్మ ముగ్గురు కలిసి ఇంటి ఆవరణలో మామిడి కాయలు కోస్తున్నారు. శ్రీనివాసరావు 12 అడుగుల స్టీల్‌రాడ్‌తో మామిడి చెట్టు కొమ్మ చివర ఉన్న మామిడి కాయలు కోస్తుండగా కొమ్మకు ఆనుకుని ఉన్న 11 కె.వి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు స్టీల్ రాడ్ తగిలింది. దీంతో శ్రీనివాసరావు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయారు. వెంటనే భార్య మల్లీశ్వరి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా సిబ్బంది శ్రీనివాసరావును పరీక్షించి చనిపోయినట్లుగా తెలిపారు. సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ప్రియుడి వేధింపులపై ఫిర్యాదు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: వించిపేట నైజాం గేటుకు చెందిన యువతిని వేధిస్తున్న మాజీ ప్రియుడు పఠాన్ ముస్తాఫాపై టూటౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఐదేళ్ల కిందట ఆ యువతి పఠాన్ ముస్తాఫాతో ప్రేమలో పడింది. పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. అతడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో పోలీసుల సమక్షంలో ఎవరి దారిన వారు ఉండాలని ఒప్పందం చేసుకున్నారు. గత కొంతకాలంగా మళ్లీ అతడు ఫోన్లు చేసి వేధిస్తుండడంతో ఆ యువతి తమకు ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

వేధిస్తున్న భర్తపై కేసు.. వ్యసనాలకు బానిసైన భర్త వేధింపులపై భార్య మేరి ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆరేళ్ల కిందట విజయవాడ రూరల్ మండలం జక్కంపూడికి చెందిన సాయికుమార్‌తో వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. గత కొంత కాలంగా వ్యసనాలకు బానిసై వేధిస్తున్న సాయికుమార్ అతడికి సహకరిస్తున్న అత్తపై మేరి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

అసభ్యంగా మాట్లాడొద్దన్నందుకు దాడి.. కుటుంబ సభ్యుల పట్ల అసభ్యంగా మాట్లాడొద్దన్నందుకు పాతరాజరాజేశ్వరీపేటకు చెందిన లక్కా శశికాంత్‌పై దాడిచేసి గాయపరిచిన ఇద్దరు యువకులపై టూటౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శశికాంత్ బంధువైన మహిళపై ఇదే ప్రాంతానికి చెందిన ఎస్.కె.గోరే, చోటే సోదరులు అసభ్యంగా మాట్లాడారు. అలా మాట్లాడొద్దని చెప్పినందుకు వారు తనపై దాడిచేసి గాయపరిచినట్లు శశికాంత్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: యువకుడి మద్యం మత్తుకు పాతబస్తీ చిట్టూరి కాంప్లెక్స్ సమీపంలోని తోపుడు బండి, రిక్షాలు ఆదివారం అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ఘటనతో ఇద్దరు జీవనోపాధిని కోల్పోయారు. తోపుడు బండి యజమాని కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను వన్‌టౌన్ సీఐ గుణరామ్ ఆధ్వర్యంలో పోలీసులు నాలుగు గంటల పాటు పరిశీలించారు. మద్యం మత్తులో ఉన్న యువకుడు వేకువజామున తూలుతూ చిట్టూరి కాంప్లెక్సు వద్దకు వచ్చాడు. తన చేతిలో ఉన్న దుస్తుల సంచిని బండిపై పెట్టి నిప్పు అంటించాడు. నిమిషాల వ్యవధిలో తోపుడు బండితోపాటు పక్కన ఉన్న రిక్షా తగలబడింది. తోపుడు బండి నిర్వాహకుడు కోటేశ్వరరావుతోపాటు రిక్షా కార్మికుడు ఉపాధి కోల్పోయారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసు సిబ్బంది నిందితుడి ఫొటోను చూపించి చుట్టుపక్కల విచారించారు. చెన్నైకి చెందిన రాజేష్ అలియాస్ తంబి అనే వ్యక్తి మద్యం మత్తులో వాటిని తగలబెట్టినట్లు విచారణలో తేలింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నారు. వన్‌టౌన్, టూటౌన్, భవానీపురం పోలీసుస్టేషన్ల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు మీద నిలిపిన ద్విచక్రవాహనాలు, ఆటోలను తగలబెట్టిన ఘటనలు ఉన్నాయి. వీటితో నిందితుడికి సంబంధం ఉందేమో అన్న కోణంలో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విజయవాడ మధ్య

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల నిఘా



రైతుబజార్ ప్రాంతంలో డ్రోన్‌తో పరిశీలన

పాయకాపురం, న్యూస్‌టుడే: నున్న పోలీసు స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం స్టేషన్ పరిధిలో ఐదు డ్రోన్లను ఎగురవేసి అనుమానాస్పద, నిర్మానుష్య ప్రదేశాలను పరిశీలించారు. రాత్రి వేళ గంజాయి, మద్యం అక్రమ రవాణా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా నిరంతర నిఘా కొనసాగిస్తున్నట్లు సీఐ అహ్మద్‌అలీ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి అవసరమైన చోట తనిఖీలు చేపడతామన్నారు.

మేముస్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

పాయకాపురం-90631 44761, అజిత్‌సింగ్‌నగర్-96035 55856

? సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ ఆవరణలో కుక్కల బెడద అధికంగా ఉంది. - రాజశేఖర్, స్థానికుడు ✓ వాటిని సిబ్బందితో పట్టించేందుకు చర్యలు తీసుకుంటాం.- హరీష్, అసిస్టెంట్ వెటర్నరీ విభాగం అధికారి ? నందమూరి నగర్ మూడవ లైన్‌లో ఇంటింటి చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదు. - సుశీల, స్థానికురాలు ✓ పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్త సేకరణకు చర్యలు తీసుకుంటాం. - అన్నపూర్ణ, ఏఎంవోహెచ్, సర్కిల్-2 - న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్

స్పందన: ★ సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ ఆవరణలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు మేముస్నాం మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి సిబ్బందితో కుక్కలను పట్టించారు. ★ నందమూరినగర్ మూడో లైన్‌లో ఇంటింటి చెత్త సేకరణకు సిబ్బంది రావడం లేదని స్థానికులు అధికారులకు తెలుపగా వారు స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త సేకరణకు చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, పాయకాపురం


అష్టబంధన ద్రవ్యారాధన

పున్నమ్మతోట(విజయవాడ సిటీ): పున్నమ్మతోటలోని తిరిదే కల్యాణ మండపం ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడధ్వజ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అంగహోమం, అక్షిమోచనం, పంచగవ్య, క్షీర, జలాధివాసాలు, ఆదివాస హోమాలు, అష్టబంధన ద్రవ్యారాధన, గరుడబింబ స్థాపన, మహాశాంతి తిరుమంజనం, మహా శాంతి హోమాన్ని నిర్వహించారు.

కూలితే కప్పు.. ఎన్నటికి కనువిప్పు?

శిథిల భవనాలతో భయపడుతున్న ప్రజలు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే



కృష్ణా హోటల్ సెంటర్‌లో అంగన్‌వాడీ భవనం పరిస్థితి ఇది



రామ్‌నగర్‌లో..

అజిత్‌సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇవి ఎప్పుడు కూలుతాయోనని ఆయా ప్రాంతాల్లో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రామ్‌నగర్ కాలనీ, కృష్ణా హోటల్, దాబాకొట్లు సెంటర్లలోని భవనాలు పూర్తిగా పాడైపోయాయి. వాటి చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు విపరీతంగా పెరిగాయి. దీనికితోడు విషసర్పాలు, ఇతర విషపురుగులు సంచరిస్తుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు కలవరపడుతున్నారు. కొందరు ఆకతాయిలు అక్కడ చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. శిథిల భవనాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న వాటిని వెంటనే తొలగించాలని కోరుతున్నారు. దీనిపై ప్రాజెక్టు-2 ఏఈ సుష్మాని వివరణ కోరగా రామ్‌నగర్ కాలనీలోని శిథిల భవనం తొలగింపునకు ప్రతిపాదనలు వచ్చాయి. మిగిలిన వాటిని కూడా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు

దాబాకొట్లు సెంటర్‌లో గతంలో 5 నుంచి 10 తరగతుల వరకు పాఠశాల ఉండేది. ప్రస్తుతం అందులో నుంచి విద్యార్థులను ఇతర పాఠశాలకు తరలించారు. అప్పటి నుంచి ఆ భవనం వినియోగంలో లేకపోవడంతో శిథిలమైంది. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయి. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. అధికారులు ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలి. - జేసుదనం, స్థానికుడు

పెరిగిన ఆకతాయిల ఆగడాలు

ఇటీవల కొంతమంది ఆకతాయిలు బృందాలుగా ఏర్పడి భవనాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మత్తుపదార్థాలు వినియోగించేందుకు స్థావరంలా ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రానికి వారంతా చేరి గొడవలుపడి స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలి. - జాషువా, స్థానికుడు

కొమ్మలు తొలగించరూ..



లెనిన్ సెంటర్‌లోని అంతర్గత రహదారిలో చెట్ల కొమ్మలు రాకపోకలకు అవరోధంగా ఉన్నాయి. విద్యుత్తు శాఖ సిబ్బంది వీటిని నరికి వదిలేసి ఐదు రోజులు గడుస్తున్నా పారిశుద్ధ్య కార్మికులు తొలగించలేదని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి కొమ్మలు తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్

నగరపాలక సంస్థ కార్యాలయంలో పీజీఆర్ఎస్ నేడు

నగరపాలక సంస్థ: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లుగా నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో నివాసం ఉండే ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

మధురానగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతులు కారణంగా మధురానగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవై కొండలరావు తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు దేవీనగర్ 5 నుంచి 8వ లైను వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పందించరేం?: మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే: సత్యనారాయణపురంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారిందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. ఆదివారం డివిజన్‌లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రహదారులపై డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతోందని కూటమి నాయకులు చెత్త డివిజన్‌గా మార్చివేశారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం బ్రాహ్మణుల పథకాలను రద్దు చేసిందని విమర్శించారు. శర్వాణిమూర్తి, డి.శ్రీనివాస్, కె.రత్నకుమార్, కె.కృష్ణమోహన్, మారుతి, సనత్, చందుశర్మ తదితరులు పాల్గొన్నారు.

నీతిపద్యాల కంఠస్థంతో జ్ఞాపకశక్తి మెరుగు



పుస్తకాలు చూపుతున్న చిన్నారులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే 'చదవటం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు నీతి పద్యాల మినీ పుస్తకాలు పంపిణీ చేశారు. పలమనేరుకు చెందిన తులసినాథంనాయుడు.. 108 పద్యాలు, వాటి భావాలతో ఈ పుస్తకాన్ని రచించి వారికి అందించారు. అడగ్గానే 50 పుస్తకాలు పంపించిన రచయితకు గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే నీతి పద్యాలు నేర్చుకుంటే తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించటం నేర్చుకుంటారని తెలిపారు. పద్యాలను కంఠస్థం చేయటంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతుందని, తెలుగు భాషపై ఆసక్తి, పద సంపద అభివృద్ధి చెందుతుందన్నారు.

గంజాయిపై సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న సీఐ బాలమురళీకృష్ణ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: గంజాయి అమ్మకం, కొనుగోలు, వినియోగంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని గవర్నర్‌పేట సీఐ బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. 'ఈగల్ ఛాలెంజ్' కార్యక్రమంలో భాగంగా గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు మైక్‌లో ప్రచారం చేశారు. ఎన్టీఆర్ కాంప్లెక్సు వద్ద జరిగిన కార్యక్రమంలో సీఐ బాలమురళీకృష్ణ స్థానికులతో మాట్లాడారు. గంజాయి తాగే వారిని పట్టిస్తే రూ. 1,500, గంజాయి విక్రయించే వారిని పట్టిస్తే రూ.5వేలు ఇస్తామని తెలిపారు. ప్రజలు 112 లేదా 1972కు సమాచారం అందించాలని సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

పాయకాపురం, న్యూస్‌టుడే: మద్యం తాగి వచ్చి భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏబ్లాక్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్న కట్ట శ్రావణి(29)కి.. కోటయ్యతో సుమారు 13 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా కోటయ్య మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. పిల్లలను సైతం సరిగ్గా పట్టించుకోవడం లేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

పాయకాపురం: 63వ డివిజన్ డాక్టర్స్ కాలనీలో వినాయక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆదివారం తెదేపా యువ నాయకుడు బొండా రవితేజ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సామాజిక కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. మాజీ కార్పొరేటర్‌లు తిరుపతమ్మ, తెదేపా నాయకులు వైకుంఠం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

సూర్యారావుపేట: బీసెంట్ రోడ్డులో చిరు వ్యాపారి నాగరాజు కుమార్తె దేవిక కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతోంది. చికిత్సకు ఒక్కో ఇంజెక్షన్‌కు రూ.15 వేలు ఖర్చు అవుతుంది. విషయం తెలుసుకున్న సీతారాంపురానికి చెందిన మహంతి అప్పలనరసయ్య, మహాలక్ష్మి(మామ్) ట్రస్ట్ ఛైర్మన్ మహంతి వాసుదేవరావు ఆసుపత్రికి వెళ్లి చిన్నారి తల్లిదండ్రులకు రూ.15 వేలు అందించారు.

జమున నటనతో పాత్రలకు జీవం



నివాళులర్పిస్తున్న కళాసంస్థల నిర్వాహకులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ నటి జమున తన సహజ నటనతో ప్రత్యేక స్థానం సంపాదించుకుని, అనేక మరపురాని పాత్రలకు జీవం పోశారని మహానటి సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి కొనియాడారు. ఆదివారం గాంధీనగర్‌లోని కౌతాపూర్ణానంద కళావేదికలో జమున జయంతి సందర్భంగా నగరంలోని వివిధ కళా సంస్థల నిర్వాహకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ 1953లో పుట్టిల్లు చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసి తెలుగు, కన్నడ, తమిళ, హిందీ భాషల్లో నటించారన్నారు. గుండమ్మ కథ, శ్రీకృష్ణ తులాభారం, మూగ మనసులు, రాముడు భీముడు చిత్రాలతో మంచి గుర్తింపు పొందారన్నారు. చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, ఆర్.చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

హజరత్తయ్య గుప్తా సేవలు ప్రశంసనీయం



సన్మానం అందుకున్న గుప్తాతో కళాకారులు, నిర్వాహకులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలు, సాంస్కృతిక వైభవాన్ని వివిధ ప్రాంతాలకు విస్తరిస్తూ రాష్ట్ర నటీనట నాట్య వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల హజరత్తయ్య కళాకారులకు అండగా నిలుస్తున్నారని రాగాల పల్లకి సరిగమప నిర్వాహకురాలు కృష్ణవేణి అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఆశిష్ స్టూడియోలో రాగాల పల్లకి సరిగమప నిర్వాహకుల ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను కళాకారులు, నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం గాయకులు సినీ గేయాలతో అలరించారు. గాయకులు ప్రసాద్, జయరాజు, హరిప్రసాద్, వీవీ రావు, వీరయ్య, మున్నా, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ఉత్సవాలు



అన్నసంతర్పణ చేస్తున్న కమిటీ సభ్యులు

పాయకాపురం, న్యూస్‌టుడే: కండ్రిక సమీపంలోని రాధానగర్‌లో జైసంతోషిమాత ఆలయ 28వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మూడు రోజులు నిర్వహించిన వేడుకలకు 8 జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. చివరి రోజు సుమారు ఐదు వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి మార్కండేయులు, కార్యదర్శి చిరంజీవి, సిద్ధాంతి రాజు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొండాకు కృతజ్ఞతలు



ఉమా చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్ కులస్థులు

సీతారాంపురం (మధురానగర్), న్యూస్‌టుడే: ముదిరాజ్ సమస్యలను శాసనసభలో ప్రస్తావించిన సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుకు ముదిరాజ్ కులస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్ సంఘం పిలుపు మేరకు ఆదివారం సీతారాంపురంలో బొండా ఉమా చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు గురించి శాసనసభలో ప్రస్తావించి అందరి మన్ననలను పొందారంటూ ఆయనకు జేజేలు పలికారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్, మాజీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, కె.సుధాకర్, బోడి ఉమ, తలాడి రాజేష్, ఎం.గోపి, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానికులకు మిఠాయిలు పంచారు.

'ఇంటింటికీ తెదేపా' నూరు శాతం పూర్తి



బూత్ ఏజెంట్లను సన్మానించిన రవితేజ, బాలస్వామి

సూర్యారావుపేట: 23వ డివిజన్‌లో 'ఇంటింటికీ తెదేపా' కార్యక్రమంలో నూరు శాతం పూర్తి చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే బొండా ఉమా తనయుడు రవితేజ ఆదివారం డివిజన్ కార్యాలయానికి వచ్చి బూత్ ఏజెంట్లను సత్కరించారు. అనంతరం రవితేజ మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకోవటంలో పార్టీ శ్రేణులు చురుకైన పాత్ర పోషించాయని కొనియాడారు. మాజీ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి మాట్లాడుతూ 23వ డివిజన్ ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తున్నామని, ఎమ్మెల్యే బొండా ఉమా సహకారంతో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. దుర్గారావు, రత్న, సూర్య, రాము, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న సురేష్, నిర్మల తదితరులు

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే: ఆర్థికంగా వెనుకబడిన పేద ఆర్యవైశ్య మహిళలను ఆదుకోవడం అభినందనీయమని విజయ కృష్ణా సూపర్ బజార్ ఛైర్మన్ వెలగా సురేష్ అన్నారు. ఆదివారం లోటస్ ల్యాండ్ మార్క్‌లో ఆవోప ట్రస్ట్, ఎన్ఆర్ఐ వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పేద ఆర్యవైశ్య కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆవోప ట్రస్ట్ సభ్యులు అరవేటి నిర్మల, జ్యోతి, రూప తెలిపారు. గుప్తా, నరేష్, కోమల్‌రావు, ఇ.సత్యనారాయణ, వి.సాంబశివరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆగిన పనులు.. పెరిగిన పొదలు

ఇబ్బంది పడుతున్న వాకర్లు

మధురానగర్, న్యూస్‌టుడే



కాలువ పక్కన గుబురుగా పిచ్చిమొక్కలు

మధురానగర్ ఏలూరు కాలువ గట్టుపై నిర్మించిన వాకింగ్ ట్రాక్‌పై పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. మధురానగర్ కృష్ణుని గుడి నుంచి పప్పుల మిల్లు రోడ్డు వరకు రూ. కోటి వ్యయంతో వాకింగ్ ట్రాక్, పార్కు ఏర్పాటు చేస్తున్నారు. బిల్లులు రాక రెండు నెలలుగా పనులు ఆపేశారు. వాకింగ్ ట్రాక్ దాదాపు పూర్తి కాగా... లైటింగ్, జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పనులు చేయకపోవడంతో వాకింగ్ ట్రాక్‌పై పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. నడిచేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా కాలువ వైపు పిచ్చిమొక్కలు అధికంగా ఉన్నాయి. వాటిలో నుంచి పాములు, విషపురుగులు వస్తున్నాయి. వాకర్లు భయపడుతున్నారు. వాటిని తొలగించేందుకు స్థానికులు సిద్ధంగా ఉన్నారు. అధికారులు అనుమతి ఇస్తే.. వాటిని తొలగించి వాకర్లకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అంటున్నారు. లేదంటే నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది అయినా పిచ్చిమొక్కలు తొలగిస్తే నడిచేందుకు వీలుగా ఉంటుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సంప్రదాయాల పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం



ప్రసంగిస్తున్న అరుణశ్రీ, వేదికపై పద్మావతి, ప్రతాప్

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంస్కృత భాష, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో మహిళల పాత్ర ఎంతో కీలకమని కంచి పీఠం సంప్రదాయ కళాశాల ప్రిన్సిపల్ విష్ణుభట్ల పద్మావతి అన్నారు. సంస్కృత భారతి విజయవాడ నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కృత సప్తాహ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బాల కేంద్రం విద్యార్థులతో సంస్కృత భాషలో నాటికలు, పాటలు, నృత్యాలు, రూపకాలను ప్రదర్శించారు. ఆదివారం సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో సంస్కృతంలోనే విద్యాబోధన జరుగుతోందన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గొట్టుముక్కల ప్రతాప్ మాట్లాడుతూ సంస్కృతం కొందరికే పరిమితమైన భాష కాదని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. బాల కేంద్ర ఉపద్రష్ట అరుణశ్రీ మాట్లాడుతూ చిన్నారుల హృదయాల్లో సంస్కృత భాషా బీజాలను నాటాలనే ఉద్దేశంతో సంస్కృత భారతి బాల కేంద్రాల ద్వారా శిక్షణ ఇస్తోందని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, రూపకాలు ఆకట్టుకున్నాయి. జొన్నభట్ల అపర్ణ, సావిత్రి, గిరిజ, డాక్టర్ లాస్య ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ ప్రభ మహోత్సవం



అలరించిన వేషధారణలు



అమ్మవారి ప్రభ ఊరేగింపు

దుర్గాఅగ్రహారం (సూర్యారావుపేట), న్యూస్‌టుడే: దుర్గా అగ్రహారం లిక్కిపుల్లయ్య వీధిలో కనకదుర్గమ్మ ప్రభ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. గత 77 సంవత్సరాలుగా ఏటా ఈ వేడుకలు అమ్మవారి ప్రభ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతాయి. ఆదివారం ఉదయం ఘనాచారి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. భేతాళ నృత్యాలు, డప్పుల హోరు మధ్య సంబరాలు ప్రారంభమయ్యాయి. దుర్గాఅగ్రహారం పురవీధుల్లో అమ్మవారి ప్రభను ఊరేగించారు. ఊరేగింపులో ప్రజలు అమ్మవారికి హారతులు పట్టారు. మొక్కులు చెల్లించుకున్నారు.

అల్లర్లకు పాల్పడితే సహించం



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అహ్మద్‌అలీ

పాయకాపురం, న్యూస్‌టుడే: నున్న పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు 40 మంది రౌడీషీటర్లకు ఆదివారం స్టేషన్ ఆవరణలో సీఐ అహ్మద్‌అలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరాలకు దూరంగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని సీఐ హెచ్చరించారు. వ్యక్తిగత కక్షలు, గొడవలు, బెదిరింపులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. సెక్టార్ ఎస్ఐలు విమల, పండుదొర, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొంగుతున్న మ్యాన్‌హోల్



మధురానగర్ కొబ్బరితోటలో పొంగుతున్న మ్యాన్‌హోల్‌తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా మ్యాన్‌హోల్ నుంచి మురుగునీరు పొంగుతోంది. రెండు రోజుల క్రితం నగరపాలకసంస్థ సిబ్బంది వచ్చి జెట్ ద్వారా భూగర్భ డ్రైనేజీ పైపులైన్‌ను శుభ్రం చేసేందుకు ప్రయత్నించారు. దాదాపు అరగంట సేపు కష్టపడినా ఫలితం లేకపోయింది. దీంతో సిబ్బంది అక్కడ నుంచి వెళ్లిపోయారు. అప్పటి నుంచి మురుగునీరు నిరంతరం పొంగుతూ పక్కనే ఉన్న ఓపెన్ డ్రెయిన్‌లోకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్య పరిష్కరించకుండా అలాగే వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మధురానగర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విజయ కృష్ణా సూజర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్ అన్నారు. 'ఇంటింటికీ తెదేపా' కార్యక్రమంలో భాగంగా ఆదివారం లోటస్ ల్యాండ్ మార్క్‌లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రెండేళ్ల ప్రభుత్వ పాలనపై ప్రజలకు వివరించారు. నవీన్, సత్యనారాయణ, కోమల్‌రావు, నరేష్, అల్లూరయ్య, కోటేశ్వరరావు, రమ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



జాగ్రత్తలు చెబుతున్న సీఐ చంద్రశేఖర్

మధురానగర్, న్యూస్‌టుడే: చిన్నపాటి ఏమరపాటు ఏళ్ల తరబడి సంపాదించిన సొమ్ము పోయేలా చేస్తుందని అజిత్‌సింగ్‌నగర్ సీఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రజల సొమ్మును కొట్టేస్తున్నారని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం 30వ డివిజన్ వినాయక్‌నగర్ వాసులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఎవరైనా ఫోన్ చేసి బెదిరిస్తే కంగారుపడవద్దని, అపరిచిత వ్యక్తులు పంపిన లింక్‌లు క్లిక్ చేయవద్దని, పార్ట్‌టైం ఉద్యోగాలు, చిన్న చిన్న టాస్క్‌లకు డబ్బులు వస్తాయంటే అసలు నమ్మవద్దని స్పష్టం చేశారు. తక్కువ పెట్టుబడికి ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయంటే అది మోసగాళ్ల పన్నాగమేనన్నారు. ఎవరైనా మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలని ఇది 24×7 పని చేస్తుందని తెలిపారు.

మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు

పాయకాపురం, న్యూస్‌టుడే: పైపుల్ రోడ్డులోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆదివారం 'మాదక ద్రవ్యాల నియంత్రణ'పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆ శాఖ సీఈవో శ్రీనివాసరావు, కార్యదర్శి డి.సుబ్బారావులు హాజరయ్యారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాలపై పడే ప్రతికూల ప్రభావం, విద్యార్థుల భవిష్యత్తుకు కలిగే నష్టాలను వివరించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు అండగా రావెప్

బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ విద్యార్థుల అవగాహన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే



జీరో ఎనర్జీ కూలింగ్ ఛాంబర్ గురించి వివరిస్తున్న బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ విద్యార్థులు

గ్రామీణ మహిళలకు ఆరోగ్యం, రైతులకు సేంద్రియ వ్యవసాయంపై రావెప్ శిక్షణలో విద్యార్థులు చైతన్యం కల్పిస్తున్నారు. రెండు మాసాల గ్రామీణ అవగాహన పని అనుభవ కార్యక్రమం (రావెప్)లో భాగంగా వీరంతా పల్లెబాట పట్టారు. గ్రామీణులతో మమేకమై ఆరోగ్యం, పోషణ, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. గుంటూరు లాం ఫాం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ హానర్స్ కమ్యూనిటీ సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్న 47 మంది విద్యార్థులు రావెప్ శిక్షణకు పల్లెబాట పట్టారు. గరికపాడు కేవీకే గృహ విజ్ఞానశాస్త్రం శాస్త్రవేత్త ప్రభావతి పర్యవేక్షణలో వీరంతా పల్లగిరి, గరికపాడు, అనుమంచిపల్లి, బలుసుపాడు, మక్కపేట, గండ్రాయి గ్రామాల్లో నెలరోజులుగా రావెప్ శిక్షణ కొనసాగిస్తున్నారు.

- రైతులకు చిరు ధాన్యాలు సాగు చేయాలని సూచిస్తున్నారు. జీరో ఎనర్జీ కూలింగ్ ఛాంబర్ పనితీరు ప్రయోగాత్మకంగా వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్ ప్రాముఖ్యత గురించి వివరిస్తున్నారు.
- గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి మహిళల్లో రక్తహీనత గుర్తించి మహిళలకు పోషకాహారం గురించి చైతన్యం కల్పిస్తున్నారు. చిరు ధాన్యాలతో లడ్డూల తయారీ, పండ్ల తొక్కలతో పోషకాహారం తయారీపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.
- పల్లగిరిలో విద్యార్థినులు కవిత, భాగ్యమ్మ, తస్నీన్, పూజాకుమారి, కీర్తన, ఎస్తేరురాణి, హరిత సుప్రజ, అమిత రావెప్ శిక్షణ పొందుతూ వీటిపై చైతన్యం చేస్తున్నారు. మహిళలకు కుట్లు, ఎంబ్రాయిడరీ, అల్లికల్లో బేసిక్ శిక్షణ ఇస్తున్నారు.
- శిక్షణలో ప్రతీ విద్యార్థి అయిదు కుటుంబాలను దత్తత తీసుకుంటారు. గర్భిణులు, బాలింతలు, యువతులు, రైతులు, ప్రైమరీ తరగతుల విద్యార్థులకు పోషకాహారం, చదువు గురించి వివరిస్తారు. ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు స్వీట్ షెడ్ వేస్తున్నారు.

విద్యార్థులకు సూచనలు

రావెప్ శిక్షణతో విద్యార్థులకు గ్రామీణ ప్రాంతంపై అవగాహన వస్తుంది. కళాశాలలో నేర్చుకున్న శాస్త్ర విజ్ఞానాన్ని గ్రామీణ మహిళలకు, రైతులకు అందిస్తున్నారు. ఇంటింటి సర్వే చేసి అనారోగ్య వివరాలు, పోషకాహార లోపాలను గుర్తించి వారికి సూచనలు చెబుతున్నారు.
- ఆర్.ప్రభావతి, కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త

నగరంలో పోస్టర్ గోడలు



ఎన్టీఆర్ సర్కిల్‌లో ఏర్పాటు చేశారిలా..

న్యూస్‌టుడే, విజయవాడ సిటీ: నగరంలో ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ గోడలపై, ఇతర బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా చిత్రాలు (వాల్ పోస్టర్లు) అంటిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, నగర సుందరీకరణకు ఇవి విఘాతంగా మారిన నేపథ్యంలో నగరపాలక సంస్థ నివారణ చర్యలు చేపట్టింది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో వీటిని అంటించడానికి ప్రత్యేకంగా గోడలను ఏర్పాటు చేసింది. తూర్పు నియోజకవర్గంలో వర్తక, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు నెలకొన్నాయి. వ్యాపార సంస్థల ప్రారంభోత్సవాలు, ప్రదర్శనలు, నాయకులు పుట్టిన రోజు వేడుకల ప్రచారాలకు గోడలు, డివైడర్లు, విద్యుత్తు స్తంభాలు వినియోగిస్తున్నారు. వీటి వల్ల నగరం కళావిహీనంగా ఉంటోంది. నగరపాలక సంస్థ అధికారులు ఈ సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యల్లో భాగంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో పంట కాలువకు వెళ్లే రహదారి ప్రారంభంలో పోస్టర్ గోడ ఏర్పాటు చేశారు. పోస్టర్లు ఇక్కడే అంటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వీటి వల్ల నగర పోస్టర్ రహితంగా మారే అవకాశం ఉంటుంది. ఇలాంటి గోడలు ఏర్పాటుచేయడం వల్ల సిబ్బందికి పని భారం తగ్గుతుంది. ఇతర పనులకు ఆటంకం లేకుండా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

‘క్రీడా మైదానాలపై నిర్లక్ష్యం తగదు’



మాట్లాడుతున్న కమలాకర్, నరహరిశెట్టి నరసింహారావు, బొర్రా కిరణ్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: క్రీడా మైదానాలు సరైన నిర్వహణ లేక నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు అందటం లేదని ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ ఛైర్మన్ జీవీవీఎస్ కమలాకర్ పేర్కొన్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న ఆయన ఎన్టీఆర్ జిల్లాకు విచ్చేశారు. స్థానిక క్రీడాకారులకు కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదివారం ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 14 జిల్లాల్లో పర్యటించానని, అనేక క్రీడా మైదానాల నిర్వహణ సరిగా లేదని గుర్తించినట్టు తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపికల్లో ప్రతిభ కంటే డబ్బు, పలుకుబడికి ప్రాధాన్యం ఇస్తున్నారంటూ క్రీడాకారులు తనకు వివరించారని తెలిపారు. క్రీడలకు కేటాయించిన నిధులపై కూడా సరైన సమాచారం లేదన్నారు. దేశానికి అత్యుత్తమమైన క్రీడాకారులను అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ప్రతిభ ఉన్న క్రీడాకారులకు అండగా ఉంటామని కమలాకర్ పేర్కొన్నారు. బొర్రా కిరణ్, నరహరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు.

మాతృభాష అభివృద్ధితోనే సుస్థిర ఉపాధి



పుస్తకావిష్కరణలో సమాఖ్య ప్రతినిధులు తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక భాషల్లో విద్య, ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినప్పుడే దేశ ప్రగతి, సుస్థిర ఉపాధి సాధ్యమని తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రతినిధులు పేర్కొన్నారు. గిడుగు వేంకట రామమూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గ్రంథాలయ భవనంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం, ప్రజా చైతన్య వేదిక సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాషకు దూరమవుతూ పాశ్చాత్య ఉద్యోగాలపై ఆధారపడటం వల్ల యువతలో అనిశ్చితి పెరుగుతోందన్నారు. స్థానిక సమస్యలకు స్థానిక భాషలో పరిష్కారాలు అన్వేషిస్తే ఉపాధితో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రధాన కార్యదర్శి మొవ్వా శ్రీనివాసరెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావులు మాట్లాడుతూ పాలనలో తెలుగు అమలు కోసం న్యాయ పోరాటం కొనసాగిస్తున్నామని తెలిపారు. తెలుగు మాధ్యమ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 20 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సాంకేతిక కార్యదర్శి రహ్మానుద్దీన్ మాట్లాడుతూ ఏఐ, ఎల్‌ఎల్‌ఎం వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో తెలుగుకు సమాన సామర్థ్యం ఉందన్నారు. ఈ సందర్భంగా 1973లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ కమిటీ సమర్పించిన నివేదికల సంకలనమైన ‘శిష్ట వ్యావహారిక భాష, నివేదిక’ గ్రంథాన్ని ముకేశ్వరరావు ఆవిష్కరించారు. ఆంధ్ర లయోలా కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, భాషాభిమానుల పాల్గొన్నారు.

న్యాయనిర్ణేతలు క్షుణ్ణంగా పరిశీలించాలి



రిఫరీలకు జ్ఞాపికలు బహూకరించిన సినీ హీరో సుమన్. పక్కన గల్లా రూపస్ పాల్, గ్రాండ్ మాస్టర్ ప్రకాశరావు తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పోటీల నిర్వహణ సమయంలో న్యాయ నిర్ణేతలు క్షుణ్ణంగా పరిశీలించాలని సినీ హీరో, రాష్ట్ర ఫిల్మ్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, గ్రాండ్ మాస్టర్ సుమన్ తల్వార్ పేర్కొన్నారు. ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(అస్మా) వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గాంధీనగర్ కౌతా వారి సత్రంలో నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రిఫరీ శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఎప్పటికప్పుడు వస్తున్న నూతన మార్పులను గమనిస్తూ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. నేర్చుకున్న విద్యను మంచి పనికి వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. బెల్ట్ పరీక్షలు సక్రమంగా నిర్వహించి అర్హులైన వారికి మాత్రమే ప్రదానం చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ శిబిరానికి విచ్చేసిన రిఫరీలకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో అస్మా కార్యదర్శి గల్లా రూపస్ పాల్, అధ్యక్షుడు ఎస్ఎం కమల్ బాషా, నిస్కిన్ అండ్ వైఎంకే అకాడమీ వ్యవస్థాపకుడు, గ్రాండ్‌మాస్టర్ గల్లా ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ 25 అడుగుల కటౌట్ ఏర్పాటు



ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జుజ్జూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోపిశెట్టి కోటయ్య నాయుడు ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటరులో ఏర్పాటు చేసిన 25 అడుగుల పవన్ కల్యాణ్ భారీ కటౌట్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేకు కోసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, జుజ్జూరు(వీరులపాడు)

9 గ్రామాలకు నిలిచిన తాగునీరు

వత్సవాయి న్యూస్‌టుడే : కంభంపాడు సీపీ డబ్ల్యూఎస్ పైలెట్ ప్రాజెక్ట్‌లో 9 గ్రామాల్లో నాలుగు రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమస్యను పరిష్కారించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ స్వామినాయక్‌ను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా మంచి నీటి కొరత ఏర్పడిందని, దాని స్థానంలో కొత్తది తీసుకొచ్చామని పూర్తవుతుందని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్



కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సౌకర్యాలు అమలు చేయాలని ఇఫ్టూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షురాలు జి.భారతి అధ్యక్షతన నిర్వహించిన ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రకాల యాప్‌లతో ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలను తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తోందని మండిపడ్డారు. ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షురాలిగా జి.భారతి, ప్రధాన కార్యదర్శిగా వీఆర్ జ్యోతి, గౌరవాధ్యక్షుడిగా ఆర్.హరికృష్ణ, న్యాయ సలహాదారుగా ఎం.లక్ష్మి, ఉపాధ్యక్షులుగా పి.పద్మ, వెంకటరత్నం, కార్యదర్శులుగా ఎస్.కృష్ణవేణి, జె.గంగాదేవి, కె.విజయలక్ష్మి, కోశాధికారిగా వి.శిరోమణి ఎన్నికయ్యారు. ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు కె.పోలారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుక

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ రామాలయంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ నాయకులు రక్షాబంధన్ వేడుక నిర్వహించారు. ఈసందర్భంగా రావూరి రామారావు మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ శత వసంతాలు పూర్తి చేసుకున్న వేళ అంతా ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు తొర్లికొండ సీతారామయ్య, బండారు కేదార్‌నాథ్‌శర్మ, వందేమాతరం అశోక్, కొమరగిరి వాచస్పతి, ఆంజనేయులు, అన్నవరపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

కంచికచర్ల, న్యూస్‌టుడే : గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని కంచికచర్ల రాజ్యలక్ష్మి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకురాలు పి.శైలజ తెలిపారు. గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత ఇంటి వద్దే సిలిండర్ డెలివరీ ఇస్తామని.. వినియోగదారులు ఏజెన్సీ కార్యాలయం వద్దకు రావద్దని సూచించారు. సిలిండరు బరువు తూకం సరి చూసుకున్న తర్వాతే సిలిండరు తీసుకోవాలని అన్నారు.

అత్యాచారం కేసులో ఐదుగురి అరెస్టు

పాయకాపురం, న్యూస్‌టుడే: విజయవాడ వాంబే కాలనీలో నివాసముంటున్న రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన ఓ మహిళపై జరిగిన అత్యాచారం కేసులో ఐదుగురు నిందితులను నున్న పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ నెల 29వ తేదీ తెల్లవారుజామున ఈ ఘాతుకం జరగగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైన సంగతి తెలిసిందే. బాధితురాలి నుంచి మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ దైవప్రసాద్ వాంగ్మూలం తీసుకున్నారు. ఆయన పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టారు. ఆ సమయంలో ఫిర్యాదులో పేర్కొన్న విధంగా కాకుండా అదనంగా మరో అంశాన్ని బాధితురాలు పోలీసులకు చెప్పింది. ఈ ఘాతుకంలో మరో ముగ్గురు కూడా నిందితులకు సహకరించారని బాధితురాలు ఏసీపీ వద్ద వాపోయింది. దీంతో ఆ ముగ్గురినీ కూడా కేసులో చేర్చారు. బాధితురాలికి షేక్.రెహ్మాతుల్లా(24), లింగాల సాయికుమార్(20)తో పరిచయం ఉంది. ఈ నెల 28న రాత్రి ఓ ఇంట్లో జరిగిన పుట్టిన రోజు వేడుకలకు బాధితురాలు, నిందితులు హాజరై మద్యం తాగారు. తెల్లవారుజామున బాధితురాలి ఇంట్లోకి ప్రవేశించి వారిద్దరు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు మరో ముగ్గురు కూడా సహకరించారని తేలింది. వీరి పేర్లను పోలీసులు బయట పెట్టలేదు. నేరంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇద్దరితో పాటు అందుకు సహకరించిన ముగ్గురిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చనున్నట్టు నున్న పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి.. ఇద్దరి దుర్మరణం





నాగరాజు, రమేష్ (పాతచిత్రాలు)

ఎర్రుపాలెం, గంపలగూడెం, న్యూస్‌టుడే: వివాహానికి హాజరై ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన దుర్ఘటన ఎర్రుపాలెం మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పెసరమల్లి నాగరాజు(32), ఏపీలోని గంపలగూడెం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కొరకప్పుల రమేష్(45) ద్విచక్ర వాహనంపై బుచ్చిరెడ్డిపాలెంలో ఓ వివాహానికి హాజరయ్యారు. అనంతరం గ్రామంలోని తమ మామ ఇంటి నుంచి ప్రధాన రహదారి పైకి వస్తూ.. అదే సమయంలో మట్టి తరలిస్తున్న బనిగండ్లపాడుకు చెందిన ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ట్రాక్టర్ ఎదురుగా ఉన్న ప్రహరీని ఢీకొని ట్రక్కు వారిపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మధిర గ్రామీణ సీఐ మధు, ఎస్సై రమేష్‌కుమార్ ప్రమాదస్థలాన్ని పరిశీలించి ట్రాక్టర్ ట్రక్కును తొలగించి మృతదేహాలను బయటకు తీశారు.

☛ మృతి చెందిన నాగరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరూ ఇదే గ్రామానికి చెందిన ముల్లంగి లాజర్ కుటుంబంలో అల్లుళ్లు కావటంతో ఆయా కుటుంబాల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో ఎన్నడూ లేనివిధంగా ఘోర ప్రమాదం జరగటంతో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. కేసు నమోదు చేసి సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీ

ట్రాఫిక్ కానిస్టేబుల్ సమయస్ఫూర్తితో తప్పిన ముప్పు



ప్రమాదంలో ధ్వంసమైన క్యాబిన్

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : జాతీయ రహదారి-30పై ఆదివారం రెండు లారీలు ఢీకొన్నాయి. సేకరించిన సమాచారం మేరకు.. రెండు లారీలు వేగంగా ఒక దాని వెనుక మరొకటి ఇబ్రహీంపట్నం నుంచి విజయవాడ వైపు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గుంటుపల్లి ఎన్టీఆర్ కూడలి వద్ద ఓ ద్విచక్ర వాహనదారుడు రోడ్డు దాటేందుకు యూటర్న్ తీసుకుంటుండగా, అతడిని తప్పించే క్రమంలో ముందు వస్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకు వేశారు. దీంతో వెనుక వస్తున్న లారీ ముందున్న దాన్ని బలంగా ఢీకొనగా క్యాబిన్ నుజ్జునుజ్జు అయ్యింది. అందులో ఇరుక్కున్న డ్రైవర్ భయంతో కేకలు వేయడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ సుధాకర్ స్పందించారు. సమయస్ఫూర్తి, స్థానికుల సాయంతో రెండు లారీలను వేరు చేసి క్యాబిన్ తలుపులు పగలకొట్టి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. దీంతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అనంతరం నిలిచిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ఇబ్రహీంపట్నం: త్రుటిలో పెను ప్రమాదం తప్పిన సంఘటన ఇది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ సిబ్బందితో పాటు ట్రాఫిక్ ఎస్సై శివరామకృష్ణ స్థానిక రింగుకూడలిలో ఆదివారం అర్ధరాత్రి 1:45 సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు ఓ కారు వేగంగా దూసుకొచ్చింది. పోలీసుల వైపు వస్తూ డివైడర్‌ను ఢీకొని, ముందు వైపు ఉన్న చక్రం విరిగి అక్కడే నిలిచిపోయింది. ఆశ్చర్యపోయిన పోలీసులు వాహనం వద్దకు వెళ్లి అందులోని నలుగురు వ్యక్తులను బయటకు తీశారు. క్రేన్ సాయంతో కారును రోడ్డు పక్కకు తొలగించారు. కారు డివైడర్‌ను ఢీకొనకుండా ఉంటే ప్రమాద తీవ్రత ఘోరంగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. విధులు నిర్వహిస్తున్న పోలీసులతో పాటు ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారు, రహదారిపై ఉన్న మరికొందరు ప్రమాదానికి గురయ్యేవారన్నారు.



క్రేన్ సాయంతో కారును పక్కకు తీస్తున్న పోలీసులు

బ్రాయిలర్ ధరలు

(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 228 చికెన్ స్కిన్‌లెస్ - 257.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

ధర వరలు



వంకాయలు-24, టమాటా-24, బెండ-14, పచ్చిమిర్చి-32, కాకర-26, బీర-24/28, క్యాలీఫ్లవర్-35, క్యాబేజి-24, క్యారెట్-40, దొండ-24, బంగాళదుంప-23, ఉల్లిపాయలు-48, గోరు చిక్కుళ్లు-20, దోస-16, సొర-8/10, పొట్ల-15/20, అరటికాయ-7/8, చామ దుంప-34, అల్లం-80/190, మునగ-6/5, ఆకు కూరలు (కట్ట)-2.50/6, కంద-34, బీట్‌రూట్-40, కీరదోస-50, బీన్స్-90, క్యాప్సికమ్-50, నిమ్మ(డజను)-48/60, కొత్తిమీర-10/20, పుదీనా-5/15, ముల్లంగి-8/10, పచ్చిమామిడి-10/12 **(నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు(కిలో రూ.ల్లో) వర్తిస్తాయి.**
- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

సీపీ మైదానంలో శతకాల మోత

సెంట్రల్ జోన్ అండర్-23 క్రికెట్ టోర్నీ



జి.దేవ్ ప్రమోద్ (238)



కేఎల్ శ్రీనివాస్ (185)



పి.దుర్గా బాలాజీ (60 నాటౌట్)

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మూలపాడు ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లోని సీపీ మైదానంలో ఆదివారం గుంటూరు బ్యాటర్లు శతకాల మోత మోగించారు. 177 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఆదివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన గుంటూరు జట్టు ఆట నిలిపే సమయానికి 130 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 603 చేసింది. జి.దేవ్ ప్రమోద్ 238, కేఎల్ శ్రీనివాస్ 185 పరుగులతో రాణించగా.. ప్రత్యర్థి బౌలర్ ఒ.రణదీప్ (5/118)మెరిశాడు. గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్‌లో 361 పరుగులు చేయగా.. పశ్చిమ గోదావరి జట్టు 209 పరుగులు చేసిన సంగతి విదితమే. దీంతో ఇరు జట్ల మధ్య మ్యాచ్ ‘డ్రా’గా ముగిసింది. గుంటూరు జట్టు తొలి ఇన్నింగ్ ఆధిక్యం కనబరచడంతో గుంటూరు జట్టు 11 పాయింట్లు, పశ్చిమ గోదావరి జట్టు 6 పాయింట్లు తమ ఖాతాలో జమ చేసుకున్నాయి. డీవీఆర్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో కృష్ణా జట్టు 150 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌ను కొనసాగించి 40.3 ఓవర్లలో 151 పరుగులకే ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్లు జీజీ పార్థసారథి, పి.దుర్గాబాలాజీ చెరో నాలుగేసి వికెట్లు కూల్చారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 28 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 157 పరుగులతో విజయకేతనం ఎగురవేసింది. పి.దుర్గా బాలాజీ 60 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ఎ.కిరణ్ 50 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ జి.నిఖిల్ ఒక వికెట్ పడగొట్టాడు. కృష్ణా జట్టు తొలి ఇన్నింగ్‌లో 224, ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్‌లో 220 పరుగులు చేసిన సంగతి పాఠకులకు విదితమే. ప్రకాశం జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో కృష్ణా జట్టుపై విజయం సాధించింది. ప్రకాశం జట్టు 11 పాయింట్లు, కృష్ణా జట్టు 5 పాయింట్లు తమ ఖాతాలో జమ చేసుకున్నాయి.

రసవత్తరం.. రెట్టించిన ఉత్సాహం



ఫుట్‌బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

మైలవరం(జి.కొండూరు),: స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి మైదానంలో ఏపీ ఎఫ్ఏ ఆధ్వర్యంలో రాధిక ఛారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో జరుగుతున్న సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం మూడో రోజు ఉత్సాహంగా సాగాయి. క్వార్టర్ ఫైనల్-3లో విశాఖపట్నం 2- 0 తేడాతో కాకినాడపై, క్వార్టర్ ఫైనల్- 4లో విజయనగరం 4- 1తో శ్రీసత్యసాయిపై గెలిచి సెమీస్‌కు చేరాయి. తొలి సెమీ ఫైనల్లో విశాఖపట్నం 3-1తో ఈస్ట్ గోదావరిపై ఘన విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈస్ట్ గోదావరి, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం సెమీస్‌కు చేరగా విశాఖపట్నం ఈస్ట్ గోదావరిపై విజయం సాధించి ఫైనల్‌కు చేరిందని ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శేషగిరిరావు తెలిపారు.

నందిగామ
•నందిగామ • జగ్గయ్యపేట

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


నగదు అందజేస్తున్న దాతలు మానస, మాధవి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో కోదండ రామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం గ్రామానికి చెందిన తూమాటి మస్తానయ్య, వెంకాయమ్మ కుమార్తెలు ధూళిపాళ్ల మానస, వెల్ది మాధవి రూ.లక్ష విరాళం అందజేశారు. విరాళాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ నెలకుదిటి నాగేశ్వరరావు, కమిటీ సభ్యులకు అందజేశారు.

పవన్‌కల్యాణ్ ముందస్తు పుట్టినరోజు వేడుకలు


సత్కారం అందుకున్న విశ్రాంత సైనికులతో హరికృష్ణ, నాయకులు

నందిగామ, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మ దినం పురస్కరించుకొని విశ్రాంత సైనికులను ఘనంగా సన్మానించారు. నందిగామ రామాలయంలో ఆదివారం స్థానిక సొసైటీ అధ్యక్షుడు కొట్టే హరికృష్ణ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేకు కోశారు. అనంతరం విశ్రాంత సైనికులు డాక్టర్ గోపిశెట్టి యశ్వంత్, శంకర్ రెడ్డి, ఇజ్రాయిల్, బాణాల నరసింహారావు, నేతుల వెంకట నరసింహారావు, మాలావతి సైదులు తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తొర్లికొండ సీతారామయ్య, వడ్డెల్లి సుధాకర్, తుటారి కృష్ణ, బెల్లంపూడి గోపి, దుగ్గిదేవి గోపికృష్ణ, కొమ్మినిడి సత్యనారాయణ, పవన్ ఆర్మీ ప్రతినిధులు నాగేంద్ర, సుగుణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందన: • నందిగామ ఏడో వార్డులో, రైతుపేటలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకొని రాగా వెంటనే స్పందించారు. వెంటనే కొత్త వీధి దీపాలు వేశారు. • నందిగామ ముక్కపాటి నగర్‌లో ప్రధాన పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతుంది. ఈ విషయాన్ని మున్సిపల్ ఏఈ పణిశ్రీనివాసరావు దృష్టికి తీసుకు రాగా వెంటనే పరిశీలించారు. సామగ్రి తీసుకొచ్చి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. • నందిగామ పట్టణ శివారు అనాసాగరంలో రెండు చోట్ల పైపులైన్ పగిలింది. మున్సిపల్ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేయించారు. • నందిగామలో చందర్లపాడు రోడ్డులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని మున్సిపల్ కమిషనర్ లోవరాజు తెలియజేయగా పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, నందిగామ

వాహనాల రద్దీ.. ప్రజలకు ఇబ్బంది

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే


పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

పెనుగంచిప్రోలులో నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పోలీస్ స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు ప్రధాన రహదారుల సెంటర్ల కూడలి కావడంతో నిత్యం అవస్థలు పడుతున్నారు. పక్కనే పోలీస్ స్టేషన్ ఉన్న పోలీసులు పట్టించుకోవడం లేదు. ఈ పోలీస్ స్టేషన్ పక్కనే ముక్కపేట రోడ్డులో ఆటో స్టాండ్ ఉంది. దీంతో రోడ్డుపైనే ఆటోలు పార్కింగ్ చేస్తున్నారు. మరోవైపు పండ్ల, ఇతర వ్యాపారాల బండ్లు, బల్లలు పెట్టారు. దీంతో రహదారి ఇరుకుగా మారింది. ఈ నేపథ్యంలో తరచూ వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. విజయవాడ, మధిర, అమ్మవారి ఆలయానికి వెళ్లే రహదారుల్లో ఆక్రమించి పలు రకాల వ్యాపారాలు చేస్తున్నారు. వీటి కారణంగా ఆర్టీసీ బస్సులు ఎక్కి దిగేందుకు ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు.

పట్టించుకోని పోలీసులు

ప్రతి క్షణం ట్రాఫిక్‌తో నరకం చూస్తున్న ప్రజలకు పోలీసుల నుంచి సహకారం అందడం లేదు. ఆటోలు రోడ్లపై పెడుతున్నా పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరూ వహిస్తారని జనం ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే: మండల పరిధిలోని జుజ్జూరు గ్రామంలో రోజురోజుకూ ట్రాఫిక్ కష్టాలు తీవ్రంగా ఉంటున్నాయి. జుజ్జూరు అనేక గ్రామాలకు కేంద్రంగా ఉండడంతో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు రహదారికి ఇరువైపులా దుకాణాలు ఉంటాయి. ఈ గ్రామం మీదుగా వెళ్లే కంచికచర్ల-మధిర ప్రధాన రహదారి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉంటుంది. తమ అవసరాల కోసం వచ్చేవారు వాహనాలను రోడ్డుపైనే నిలిపి దుకాణాలకు వెళ్తుంటారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. గ్రామంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


జుజ్జూరులో బారులు తీరి..

తిరుపతమ్మ ఆలయానికి భారీగా భక్తుల రాక


అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో..

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి తెలుగు రాష్ట్రాల నుంచి ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. స్థానిక మునేరులో స్నానమాచరించి అమ్మవారికి పాల పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఛైర్మన్ చుంచు రమేష్ బాబు, ఈవో లీలాకుమార్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం


సుధాకర్‌ను సన్మానిస్తున్న విజయబాబు, నారాయణరావు తదితరులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ రైతుపేటలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం చందర్లపాడు మండలం తోటరావులపాడు జడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ (బీఎస్) కందుల సుధాకర్ ఉద్యోగ విరమణ వేడుకను వినూత్నంగా నిర్వహించారు. తన ఉద్యోగ విరమణ వేడుకకు హాజరైన అతిథులు కె.విజయబాబు, ఉయ్యూరు నరసింహారావు, వాసిరెడ్డి ప్రసాద్, శీలంనేని సుధాకర్, ములకలపల్లి కృష్ణమోహన్, కొండా కృష్ణారెడ్డి, రమణారెడ్డి, డీవైఈవో యు.గురునాథం, చందర్లపాడు, నందిగామ ఎంఈవోలు జి.శ్యాంబాబు, ఎం.పద్మ తదితరులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గడ్డం నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన వేడుకలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్కే నవాబ్ జాని, ఎస్.రాఘవరాజు, కె.రవికుమార్, జి.మొగిలేశ్వరరావు, ఆర్ఎల్ నరసింహారావు తదితరులు 35 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా సేవలందించిన సుధాకర్‌ను అభినందించారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు ముల్లంగి శ్రీనివాసరావు, పటాపంచల రామారావు, టీవీ సుబ్రహ్మణ్యం, ఆవుల రాంబాబు, పి.శేఖర్‌రావు, పి.జాన్‌బాబు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు. ✦ నందిగామ పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఉపాధ్యాయినిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన గొర్రెపాటి హేమలతను ఆదివారం స్థానిక ఓ కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయిని పి.విజయలక్ష్మి అధ్యక్షతన హేమలత దంపతులకు సన్మాన పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఎం.జగన్మోహనరావు, డీవైఈవో యు.గురునాథం, ఎంఈవో-2 ఎం.పద్మ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమె సేవలను కొనియాడారు.

కూటమి హయాంలో రహదారులకు మహర్దశ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తెలిపారు. ఆదివారం పెనుగంచిప్రోలులో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డీఎంఎఫ్ నిధులు రూ.కోటితో మైత్రి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మైత్రి రోడ్డు నుంచి మునేరు వైపు వెళ్లే డొంక రోడ్డును పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని తోటచర్ల-శనగపాడు గ్రామాల మధ్య వాగుపై కల్వర్టు నిర్మాణానికి రూ.50 లక్షలు, పెనుగంచిప్రోలులో రెండు వంతెనల నిర్మాణానికి రూ.41 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్నికల హామీలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపాలకృష్ణమూర్తి, తిరుపతమ్మ ఆలయ ఛైర్మన్ చుంచు రమేష్‌బాబు, ఈవో లీలాకుమార్, మాజీ సర్పంచి జిల్లేపల్లి సుధీర్‌బాబు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గజ్జి కృష్ణమూర్తి, కొత్తపల్లి సతీష్, సూర్యకుమారి, గింజుపల్లి గోపి, ముండ్లపాటి ప్రసాదరావు, కాకాని బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకం వద్ద ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నాయకులు

జనసైనికుల సేవలు ఎనలేనివి


రక్తదాన శిబిరం వద్ద ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

కంచికచర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రగతి సాధనలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాత్ర ఎనలేనిదని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. ఉప ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని కంచికచర్ల జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. పవన్ కల్యాణ్ సేవా భావాన్ని జన సైనికులు అలవరుచుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం ఎంతగానో సహాయపడుతుందని అన్నారు. అనంతరం వాహనదారులకు శిరస్త్రాణాలు అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణకు చర్యలు


మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు, పక్కన ఎస్సైలు

వత్సవాయి, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలో గంజాయి విక్రయాలు లేవని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో కొంతమంది గంజాయి తీసుకుంటున్న వారిని డీ అడిక్షన్ సెంటర్‌కు పంపించామని చెప్పారు. తర్వాత మళ్లీ వారికి పరీక్షలు చేయగా.. నెగెటివ్ వచ్చిందని అన్నారు. గంజాయి విక్రయించడం, రవాణా చేసే సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాజు, సూర్యశ్రీనివాసరావు, శంకర్‌నాయక్, అర్జున్ మణికంఠ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు

చందర్లపాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. మండలంలోని కోనాయపాలెంలో ఆదివారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజలకు కరపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ప్రభుత్వ సహకారం, ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సహకార సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, నాయకులు ఉలవలపూడి వెంకటరత్నం, రహీం, జాన్‌కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్ ప్రక్రియ పరిశీలన


ఓటర్లతో చర్చిస్తున్న కమిషనర్ లోవరాజు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ పురపాలక సంఘం పరిధిలో సర్ ప్రక్రియను స్థానిక మున్సిపల్ కమిషనర్ లోవరాజు పరిశీలించారు. పట్టణ శివారు అనాసాగరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. సర్ నోటీసులు అందుకున్న ఓటర్లు గడువు తేదీలోపు తమ వివరాలను ఆధారాలతో సహా సమర్పించాలని కోరారు. 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వో దుగ్గినేని గోపికృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే : ప్రజాస్వామ్యంలో యువత పాత్ర కీలకంగా ఉండాలని ఎంపీటీసీ సభ్యుడు బర్రె ఉదయ్ కిరణ్ తెలిపారు. కంచికచర్లలో తన సెగ్మెంట్ పరిధిలో ఆదివారం నిర్వహించిన నూతన ఓటర్ల నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యువతలో రాజకీయ చైతన్యం రావాలి అని సూచించారు. నూతన ఓటర్లుగా సుమారు 80 మంది నమోదు చేసుకోవడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గౌడ సామాజికవర్గ సంక్షేమానికి కృషి చేస్తా


వీరాస్వామిని సన్మానిస్తున్న నాయకులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: గౌడ సామాజికవర్గ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి తెలిపారు. ఆదివారం మండలంలోని ఐతవరం గ్రామంలో ఆయన్ను గ్రామ గౌడ సంఘం నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో లక్ష మంది, నియోజకవర్గంలో 6 వేల మంది గౌడ కులస్థులు ఉన్నారని చెప్పారు. గౌడ సామాజిక వర్గం ఐక్యంగా ఉండేందుకు, వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు.

కారు ఢీ.. బాలుడికి గాయాలు

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే : కారు ఢీకొన్న ఘటనలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధి జుజ్జూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై బి.అభిమన్యు తెలిపిన వివరాల మేరకు.. కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామానికి చెందిన దక్కమడుగుల అంకమ్మరావు చిన్న కుమారుడు హేమంత్‌తో జుజ్జూరు గ్రామంలోని భార్య తరపున బంధువుల ఇంటికి దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. కంచికచర్ల-మధిర ప్రధాన రహదారి దాటే క్రమంలో అల్లూరు వైపు నుంచి విజయవాడకు వెళ్తున్న కారు హేమంత్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడి తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు కంచికచర్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాలుడికి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దివ్యాంగులకు చక్రాల స్కూటీలు

వత్సవాయి న్యూస్‌టుడే: జగ్గయ్యపేట నియోజకవర్గంలో స్వయం శక్తి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో దివ్యాంగులకు 15 మూడు చక్రాల స్కూటీలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో దివ్యాంగుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, స్వయం శక్తి విభిన్న ప్రతిభావంతుల ప్రతినిధులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.